మానేరు
# జనత ®
తెలుగు దినపత్రిక ఇది జనం గొంతుక

2.4.2026 గురువారం Thursday | సంపుటి (Volume): 10 సంచిక (Issue) : 342 | పేజీలు : 8 Pages : 8 | వెల : 2 | Published from : Karimnagar

## రిజ్వీ అద్భుత పోరాటం...
లక్నో చేతుల్లోంచి గెలుపును లాగేసుకున్న ఢిల్లీ



సమస్య ఏదైనా
జనం కోసం జనతా..
ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..

శుభాకాంక్షలు..
సంప్రదించాల్సిన మొబైల్ నంబర్.. 7989867251
- ఎడిటర్

# సోనియా వల్లే తెలంగాణ
# నంబర్ వన్
## కేరళలోనూ కాంగ్రెస్‌ను గెలిపించండి..

- అభివృద్ధిలో రాష్ట్రం పరుగులు పెడుతుంది
- కేరళకు వాళ్లిద్దరే సమస్య
- ప్రధాని మోడీ, కేరళ సీఎం పినరయి విజయన్ దొందూ దొందే!
- ఆ రెండు పార్టీలకూ బుద్ధి చెప్పండి
- కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి



**జనతా న్యూస్, హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ తెలంగాణను దత్తత తీసుకున్నారని, ఆమె చొరవ వల్లే తెలంగాణ అభివృద్ధిపథంలో దూసుకుపోగలుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోనియా గాంధీ ఆశీర్వాదంతో ఆమె మద్దతుతో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందన్నారు. కేరళం ప్రజలు సరైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఈ అవకాశాన్ని జార విడుచుకోకుండా కాంగ్రెస్ పార్టీ కూటమి అభ్యర్థులను గెలిపిం చాలని కోరారు.కాంగ్రెస్ కూటమి అధికారంలోకి

మిగతా 2 లో

## కొత్తగా నమోదు చేసుకున్న రైతులకు ఊరట
వారికి కూడా రైతుభరోసాకు ప్రభుత్వం సానుకూలం

02



04

## అసోంలో హ్యాట్రిక్ ఖాయం


- అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీజేపీదే గెలుపు
- గత పదేళ్ల పాలన సుపరిపాలన యుగం
- అధికారంలోకి రాగానే యూసీసీ అమలు
- గోగాముఖ్ ఎన్నికల సభలో ప్రధాని మోడీ

అసోంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయాన్ని సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ స్వయం ప్రకటిత యువరాజుకు ఓటముల సెంచరీ పూర్తిచేసే సందర్భం అవుతుందని ఎద్దేవా చేశారు.

### తేయాకు తోటలో మోడీ
మహిళా కార్మికులతో సంభాషణ

## ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదుపు

- 30వేల మంది టెక్కీల తొలగింపు
- అందులో 12వేమంది భారతీయులు






04

## ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

- 16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు
- వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ

దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది.

# నేటి నుంచి భూభారతి అమలు

## ఐదు మండలాల్లో ప్రయోగాత్మకం
### అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

తెలంగాణలో భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది . ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు .



02


కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్
## ఉద్యోగులకు తీపి కబురు
ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం

వేలాది మంది ఉద్యోగులకు లబ్ది చేకూరే అవకాశం

.. వివరాలు 2లో

## రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

- 29మంది దుర్మరణం
- చెందినట్టు ధృవీకరణ



04



02

## అడుగంటుతున్న జూరాల ప్రాజెక్ట్
ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

కర్నాటకతో మాట్లాడనున్న మంత్రి ఉత్తమ్

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం ఆందోళన చెందుతోంది.

రేషన్ కార్డుల తొలగింపు
## దుర్మార్గపు చర్య
5లక్షలు ఇచ్చామని చెప్పి 15లక్షలు తొలగించే కుట్ర

ప్రభుత్వ తీఈరుపై మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత

.. వివరాలు 3లో

మానేరు జనత
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక
www.epaperjanathadaily.in
గురువారం 2 ఏప్రిల్ 2026




# కొత్తగా నమోదు చేసుకున్న రైతులకు ఊరట

## వారికి కూడా రైతుభరోసాకు ప్రభుత్వం సానుకూలం

**హైదరాబాద్, ఏప్రిల్1 :** తెలంగాణ రాష్ట్రంలోని కొత్త పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులకు రేవంత్ సర్కార్ భారీ ఊరటనిచ్చింది. ఇప్పటివరకు పాత లబ్దిదారులకే పరిమితమైన రైతు భరోసా పథకాన్ని, కొత్తగా భూములు కొనుగోలు చేసి పట్టా పొందిన రైతులకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా పట్టా పొందిన సుమారు 85 వేల మంది రైతులు ఉన్నారని అంచనా వేయగా, వారిలో ఇప్పటికే 62 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను వ్యవసాయ శాఖ ప్రస్తుతం క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. రైతుల అర్హత, భూమి వివరాలు, పట్టాదారుల నిజానిజాలను నిర్ధారించిన తర్వాత వారం, పది రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయనున్నారు. అర్హులుగా తేలిన కొత్త రైతులకు ఏప్రిల్ 15 నుంచి 20వ తేదీల మధ్య యాసంగి రెండో విడత రైతు భరోసా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నారు. ఈ సీజన్‌లో సుమారు రూ. 9,000 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత వానాకాలం సీజన్‌లో లబ్ది పొందిన ప్రతి రైతుకు, ఈ యాసంగిలో కూడా ఎటువంటి కోతలు లేకుండా పూర్తిస్థాయి పెట్టుబడి సాయం అందనుంది. 2025-26 ఖరీఫ్ సీజన్‌లో సుమారు 69.39 లక్షల మంది రైతులకు ఎకరానికి రూ. 6,000 చొప్పున మొత్తం రూ. 8,744.13 కోట్లను కేవలం తొమ్మిది రోజుల వ్యవధిలోనే పంపిణీ చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించింది. రైతు భరోసా లబ్దిదారుల సంఖ్యలో నల్లగొండ జిల్లా 5.22 లక్షల మందితో అగ్రస్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో సంగారెడ్డి (3.53 లక్షలు), ఖమ్మం (3.35 లక్షలు), సిద్ధిపేట (3.18 లక్షలు) జిల్లాలు ఉన్నాయి.

# నేటి నుంచి భూభారతి అమలు

## ఐదు మండలాల్లో ప్రయోగాత్మకం

## అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి



**హైదరాబాద్,ఏప్రిల్1 :** తెలంగాణలో భూ వివాదాలకు ప్రభుత్వం చెక్ పెట్టనుంది . ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సేవలు అమలు చేయనుంది. ప్రయోగాత్మకంగా 5 మండలాల్లో పోర్టల్ ప్రారంభం కానుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి, భద్రాద్రి జిల్లా అశ్వరావుపేట, రంగారెడ్డి జిల్లా ఆమన్ గల్, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి,నారాయణపేట జిల్లా కోస్గి మండలాల్లో భూభారతి అమలు సేవలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు పోర్టల్ ప్రారంభంపై బుధవారం అధికారులతో మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డి రివ్యూ నిర్వహించారు . ఈ సందర్భంగా భూభారతితో భూవివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో వచ్చే ఫలితాలను బట్టి అవసరమైన మార్పులు చేసి, రెండో దశలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని చెప్పారు. ఎన్నికల హామీ మేరకు భూభారతి చట్టాన్ని తెచ్చామని, వ్యవసాయ భూముల క్రయవిక్రయాల సమయంలో సర్వే మ్యాపును జతపరిచే నిబంధనను కూడా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలోనే భూధార్ నంబర్‌ను కేటాయించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ఇప్పటికే నక్ష లేని ఐదు గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి, భూధార్ ఇచ్చినట్లు గుర్తు చేశారు. ఒక్క క్లిక్‌తో రైతుల భూములకు సంబంధించిన పూర్తి సమాచారం లభించేలా పోర్టల్‌ను రూపొందించామని, ఆధార్‌తో అనుసంధానమైన మొబైల్ నంబర్ ద్వారా లాగిన్ అయ్యి వివరాలు పొందవచ్చని చెప్పారు. ధరణిలో 36 మాడ్యూల్స్ ఉండగా.. వాటి గందరగోళానికి చెక్?పెడుతూ భూభారతిలో అన్నింటినీ ఒకే చాప్టర్ కిందకు తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు.

# కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు తీపి కబురు

## ఇక నేరుగా ఖాతాల్లో జీతాలు జమచేయనున్న ప్రభుత్వం

## వేలాది మంది ఉద్యోగులకు లబ్ది చేకూరే అవకాశం

**హైదరాబాద్,ఏప్రిల్1 :** తెలంగాణ రాష్ట్రంలోని వేలాది మంది కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఒక తీపి కబురు అందించింది. గత కొన్నేళ్లుగా వేతనాల చెల్లింపులో ఎదురవుతున్న తీవ్ర జాప్యం, మధ్యవర్తుల అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై ఏప్రిల్ నెల నుంచి ఈ ఉద్యోగులందరికీ నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా వేతనాలు అందుతుంటాయి. దీనివల్ల కమిషన్ల పేరిట కొంత మొత్తం కట్ అవ్వడమే కాకుండా, నెలల తరబడి జీతాలు రాక కార్మికులు ఇబ్బందులు పడేవారు. తాజా నిర్ణయంతో మున్సిపాలిటీలు, గురుకులాలు, విద్యా సంస్థలు, ఆరోగ్య శాఖ , మైనార్టీ సంక్షేమ శాఖల్లో పనిచేసే వేలాది మందికి లబ్ది చేకూరనుంది. నేరుగా ఖాతాల్లో జమ కావడం వల్ల పారదర్శకత పెరుగుతుంది.ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులకు ప్రస్తుతం ఏ విధంగానైతే 'ఇంటిగ్రేటెడ్ ÷నాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' ద్వారా జీతాలు అందుతున్నాయో, అదే విధానాన్ని కాంట్రాక్ట్ సిబ్బందికి కూడా వర్తింపజేస్తున్నారు. దీని కోసం ఇప్పటికే అన్ని జిల్లాల అధికారులు సిబ్బంది ఆధార్ కార్డులను వారి బ్యాంక్ ఖాతాలతో అనుసంధానం చేసే పక్రియను పూర్తి చేశారు. ఉన్నతాధికారులకు ఇందుకు సంబంధించిన డేటాను కూడా పంపడం జరిగింది. ముఖ్యంగా మున్సిపాలిటీల్లో పనిచేసే పారిశుద్ధ్య కార్మికులు, టెక్నికల్ వర్కర్లు గతంలో అనేక కష్టాలు పడేవారు. స్థానిక పన్నులు వసూలైతేనే జీతాలు ఇస్తామనే నిబంధనలతో అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చేవారు. టా÷-గ్గ÷ట్లు పూర్తికాకపోతే నెలల తరబడి వేతనాలు ఆగిపోయేవి. దీంతో కార్మికులు తమ నిత్యవసరాల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులపాలయ్యేవారు. ఇప్పుడు ప్రభుత్వం నేరుగా నిధులు విడుదల చేయనుండటంతో, పన్నుల వసూళ్లతో సంబంధం లేకుండా ప్రతి నెలా ఒకటో తేదీనే జీతం వచ్చే అవకాశం ఏర్పడింది.

# సోనియా వల్లే తెలంగాణ నంబర్ వన్

మొదటి పేజీ తరువాయి

వస్తే కేరళం అభివృద్ధిలో పరుగులు పెడుతుందని రేవంత్ చెప్పారు. కేరళంలో లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీఎఫ్)కు ఓటు వేస్తే బీజేపీకి వేసినట్లేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు . ఢిల్లీ కమ్యూనలిస్టు ప్రధాని నరేంద్ర మోదీ, తివేంద్రం కమ్యూనిస్టు ముఖ్యమంత్రి పినరయి విజయన్ ను గద్దె దింపితేనే కేరళంకు మంచి రోజులు వస్తాయని పేర్కొన్నారు. మోదీ, విజయన్ వి విభిన్న భావజాలాలైనా ఇరువురి భావాలొక్కటేనని, ఎల్డీఎఫ్.. బీజేపీల మధ్య ఒప్పందాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్గా ఉన్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కేరళంలోని నేమం సహా పలు నియోజకవర్గాల్లో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అన్ని సభల్లోనూ ముఖ్యమంత్రి ప్రసంగాలకు భారీ స్పందన లభించింది. నేమం నియోజకవర్గంలో యూడీఎఫ్ అభ్యర్థి కేఎస్ శబరీ నాథన్ తరఫున పూంథురలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్లను కేరళలోకి రానీవ్వకుండా లక్ష్మణ రేఖ గీసింది యూడీఎఫ్ అని అన్నారు. కేరళలో జాతీయ రహదా రులు సహాపలు అభివృద్ధి పనులు నిలిచిపోయినా ముఖ్యమంత్రి పినరయి విజయన్ నోరుమెదపడం లేదని ఆయన మండిపడ్డారు. కేరళ ప్రజలు బీజేపీ, ఎల్డీఎఫ్కు గుణ పాఠం చెప్పాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కేరళ భవిష్యత్తును దెబ్బతీయాలని చూస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, సీపీఎం మధ్య లోపాయకారి ఒప్పందం ఉందని, అందుకే వారిపై ఎటువంటి కేసులు ఉండవని విమర్శించారు. దేశంలో ఎవరినైనా బీజేపీ ప్రభుత్వం ఈడీ, సీబీఐతో వేధిస్తుందని కానీ, విజయన్ సర్కారుపై ఈగను కూడా వాలనీయదని చెప్పారు. బీజేపీ, ఎల్డీఎఫ్ బయటకు పోటీ పడుతున్నట్లు కనిపించినా, అది ఉత్తిత్తిదేనని చెప్పారు. కేరళం సమగ్రా భివృద్ధి యూడీఎఫ్ లక్ష్యమన్నారు. విద్యావంతులైన ఎందరో మలయాళీలు స్థానికం గా ఉపాధి అవకాశాలు లేక విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని వారికి స్థానికంగా ఉపాధి కల్పించే పరిశ్రమలు తగిన సంఖ్యలో లేవని చెప్పారు. పరిశ్రమల ఏర్పాటుతో పాటు కేరళం సమగ్రాభివృద్ధికి యూడీఎఫ్ ప్రణాళికలు రచిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజలు, యువతకు కాంగ్రెస్ ప్రభుత్వంతోనే న్యాయం జరుగుతుందని అన్నారు. హస్తం పార్టీకి ఓటేస్తే పాత కేరళం ఏమిటో మళ్లీ చూపి స్తామని హామీ ఇచ్చారు. డెవలప్మెంట్ విత్ డిగ్నిటీతో ముందుకు వెళుతున్నామని



ఆయన తెలిపారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని – ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### కాంగ్రెస్ ముఖ్యమంత్రులవి నిష్కళంక రాజకీయాలు

సామాజిక ప్రగతి, అభివృద్ధి, అక్షరాస్యతలో కేరళం ఎప్పటినుంచో యావత్ దేశానికే ఆదర్శ రాష్ట్రంగా నిలిచిందని, అందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయా ంలో జరిగిన కృషే కారణమని రేవంత్ రెడ్డి అన్నారు. విద్యా రంగంలో కేరళంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు సాధించిన ప్రగతిని సీఎం వివరించారు. దేశంలో అత్యధిక అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా కేరళంకు ఉన్న గుర్తింపును రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. విద్యా, అవగాహన, సామాజిక చైతన్యంలో కేరళం దేశానికి అప్పటికీ, ఇప్పటికీ నమూ నాగా ఉందని సీఎం తెలిపారు. ఇందుకు గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులు కరుణాకరన్, ఊమెన్ చాందీ, ఏకే ఆంటోనీల కృషి ప్రధాన కారణమన్నారు. వాళ్లు కేరళంకు సమగ్ర, సమ్మిళిత, సమతుల్య, నిష్కళంక రాజకీయాలను అందించారని రేవంత్ రెడ్డి కొనియాడారు. కరుణాకరన్ కేరళలో అభివృద్ధికి బాటలు వేశారని, ఊమెన్ చాందీ సంక్షేమం, అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇచ్చారని, ఏకే ఆంటోనీ నిజాయితీకి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పాలన లో కేరళంకు గౌరవం, నమ్మకం, పరిపాలనా స్థిరత్వం వచ్చిందన్నారు. కేరళంను గాడ్స్ ఓన్ కంట్రీ గా పిలుస్తారని తెలిపారు. అందుకే, దేశంతోపాటు, ప్రపంచవ్యాప్తం గా కేరళం ఒక బ్రాండ్గా నిలిచిందన్నారు. పర్యాటకం, విద్య, ఆరోగ్యం, సామాజిక పురోగతి ఇవన్నీ కేరళంను ఒక ప్రత్యేక రాష్ట్రంగా నిలబెట్టాయన్నారు.

### అక్కడా.. ఇక్కడా వైఫ్యలం..

గత 12 ఏళ్ళుగా ఢిల్లీలో 10 ఏళ్ళుగా కేరళంలో పరిస్థితులను పూర్తిగా దిగజారా యని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో మోడీ, కేరళంలో విజయన్ డబుల్ ఫెయిల్యూర్ గా నిలిచారని విమర్శించారు. ఢిల్లీలో మోడీ సారధ్యంలోని బీజేపీ ప్రభుత్వం, తిరువనంతపురంలో విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ సర్కారులో దేశం. రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్లాయని విమర్శించారు. వీరి ఇరువురి సిద్ధాంతాలు వేరు అయినా వైఫల్యాలు మాత్రం ఒకేలా ఉన్నాయని మండిపడ్డారు. నిరుద్యోగంతో ఇక్కడి యువత ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అభివృద్ధి పూర్తిగా నిలిచి పోయిందని విమర్శించారు.

# మృత్యువులా దూసుకొచ్చిన కారు

## నేడు వివాహ నిశ్చితార్థం... అంతలోనే రోడ్డు ప్రమాదం


## ప్రమాదంలో యువకుడు మృతి

**ఖమ్మం, ఏప్రిల్ 1 :** జిల్లాలో విషాదం నెలకొంది. ఎంగేజ్‌మెంట్ చేసుకోవాల్సిన యువకుడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణషాపుకు వెళ్లి తిరిగి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లి గ్రామానికి చెందిన గొడ్డుగొర్ల ప్రసాద్(28) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇటీవలే అతనికి వివాహం కూడా నిశ్చయమైంది. గురువారం నాడు నిశ్చితార్థం కావాల్సి ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మద్దులపల్లి స్టేజ్ వద్ద ఉన్న కిరాణ షాపునకు ప్రసాద్ వెళ్లాడు. తిరిగి ఇంటికొచ్చేప్పుడు రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఓ కారు ప్రసాద్‌ను ఢీకొట్టింది. తలకు తీవ్రగాయాలు కావడంతో ప్రసాద్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, రేపు నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు.. ఇలా పాడే ఎక్కడంతో మద్దులపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఈ వేసవిలో మండుటెండలు ఖాయం

## మూడు నెలలు ఎండలు, వడగాలులు తప్పవు

## భారత వాతావరణశాఖ హెచ్చరిక




**హైదరాబాద్,ఏప్రిల్1 :** రాష్ట్రంలో ఈ వేసవి సీజన్ మొత్తం ఎండ మంట పుట్టించనుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు పగటి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదుకానున్నాయని వాతావరణ వాఖ హెచ్చరించింది. రానున్న మూడు నెలలకు దేశంలో వాతావరణ పరిస్థితులు, ఎండలు, వడగాడ్పులు, వర్షాలపై భారత వాతావరణ శాఖ(ఐఎండీ) బులెటిన్ విడుదల చేసింది. వచ్చే మూడు నెలలు రాష్ట్రం నిప్పుల కొలిమిలా మారే అవకాశం ఉంది. ఏపీతోపాటు ఒడిశా, తెలంగాణలో కొంత భాగం, పశ్చిమ బెంగాల్, బిహార్, యూపీ, ఈశాన్య రాష్టాల్లో( పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదుకానున్నాయి. దేశంలోని మిగిలిన ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు సాధారణం లేదా అంతకంటే తక్కువగా నమోదవుతాయి. ఈ మూడు నెలల్లో ఎక్కువ రోజులు వడగాడ్పులు వీయనున్నాయి. ఏప్రిల్‌లో సగటున మూడు, నాలుగు రోజులు, మే, జూన్ నెలల్లో పది, అంతకంటే ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. రాత్రి వాతావరణం కూడా వేడిగానే ఉండనుంది. దేశంలోని 95 శాతం ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఎక్కువ రోజులు వడగాడ్పులు వీస్తాయి. ఏప్రిల్‌లో రాష్ట్రంలోని గోదావరి జిల్లాలు తప్ప మిగిలిన ప్రాంతాల్లో పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు సగటు కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఇక ఏప్రిల్‌లో ఈశాన్య రాష్ట్రాలు తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో సగటు కంటే ఎక్కువ వర్షపాతం నమోదుకానుంది. మార్చిలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లీమీటర్లకుగాను 33.7 మిల్లీమీటర్లు నమోదైంది. 1901 నుంచి ఇప్పటి వరకు మార్చిలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోద వడం ఇది 32వ సారి. పసిఫిక్ మహాసముద్రంలో లానినా చివరిదశకు చేరుకుంది. కొద్దిరోజుల్లో తటస్థ పరిస్థితులకు చేరుకునే అవకాశం ఉందని అంతర్జాతీయ మోడల్స్ వెల్లడిస్తున్నాయి. దీనికి అనుగుణంగా ఏప్రిల్ నుంచి జూన్ వరకు తటస్థ పరిస్థితులు కొనసాగుతాయని, జూన్(నైరుతి రుతుపవనాల ప్రారంభం) నుంచే ఎల్‌నినో మొదలవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

# అడుగంటుతున్న జూరాల ప్రాజెక్ట్

## ఆందోళనలో ఆయకట్టు రైతాంగం

## కర్నాటకతో మాట్లాడనున్న మంత్రి ఉత్తమ్

**మహబూబ్‌నగర్,ఏప్రిల్1 :** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు ప్రాణాధారమైన జూరాల ప్రాజెక్టు ప్రస్తుతం డెడ్ స్టోరేజీకి చేరుకోవడంతో పాలమూరు రైతాంగం ఆందోళన చెందుతోంది. దీంతో సాగునీటితో పాటు, తాగునీటి కష్టాలు తప్పేలా లేవు. ఎండలు ముదురుతున్న కొద్దీ ప్రాజెక్టులో నీటి మట్టం అట్టడుగుకు పడిపోవడంతో కోయిల్ సాగర్ లిఫ్ట్ మోటార్లకు నీరు అందడం లేదు. దీని ప్రభావం కోయిల్ సాగర్ చివరి ఆయకట్టుపై తీవ్రంగా పడుతోంది, సాగునీరు అందక చేతికి వచ్చిన పంటలు ఎండిపోయే స్థితికి చేరుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కోయిల్ సాగర్ ఆయకట్టును ఆదుకోవడానికి తక్షణమే నీటిని విడుదల చేయాలని స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని , సంబంధిత మంత్రిని కోరారు.మరోవైపు, రాష్ట్రంలో నెలకొన్న ఈ సాగునీటి సంక్షోభాన్ని పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టింది. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు నీటిని విడుదల చేయించేందుకు ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది.



ఇందులో భాగంగానే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తో ఫోన్ లో మాట్లాడి, జూరాలకు కనీసం 5 టీఎంసీల నీటిని తక్షణమే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కేవలం ఫోన్ సంప్రదింపులకే పరిమితం కాకుండా, ఈ సమస్య పరిష్కారం కోసం పాలమూరు జిల్లాకు చెందిన మంత్రులు , ఎమ్మెల్యేల బృందం మరో వారం రోజుల్లో బెంగళూరు వెళ్లి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను నేరుగా కలవాలని నిర్ణయించుకుంది. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నీటిని విడుదల చేస్తేనే ఎండిపోతున్న పంటలకు ప్రాణం పోసే అవకాశం ఉంటుంది.

# తెలంగాణ ఉద్యమకారులను కాంగ్రెస్ కాల్చిచంపింది

**అమరావతిపై చర్చలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు**

**నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ ఎంపిలు**

**తెలంగాణ విభజన హామీలు నెరవేర్చాలన్న ఎంపి వంశీ**



**న్యూఢిల్లీ,ఏప్రిల్1 :** ఏపీ అమరావతి చట్టబద్ధత బిల్లుపై చర్చ సందర్భంగా లోక్ సభలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. 1969 తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులను కాంగ్రెస్ కాల్చిచంపిందని వ్యాఖ్యానించారు. చివరి దశ ఉద్యమంలో కూడా 1200 మంది ఆత్మబలిదానాలతో తెలంగాణ వచ్చిందన్నారు. కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణ ప్రజలు రాష్ట్రాన్ని సాధించుకున్నారన్న కిషన్ రెడ్డి.. సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ కల సాకారమైందన్నారు. అయితే గత బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేశారని ఆరోపించారు. ఏపీలో ఏడు ఎయిర్ పోర్టులు ఉంటే.. తెలంగాణలో ఒక్కటే ఎయిర్ పోర్టు ఉందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యవహార శైలితోనే తెలంగాణకు ఎయిర్ పోర్టులు రాలేదన్నారు. ఇప్పటికైనా తెలుగు రాష్ట్రాలు కలిసి అభివృద్దిలో ముందుకెళ్లాలని సూచించారు. అన్నదమ్ముల్లాగా అభివృద్దిలో ముందుకు సాగాలన్నారు. మోడీ అందిస్తున్న చేయూత వల్ల తెలంగాణలో రైలు, రోడ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయని అన్నారు. కిషన్ రెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎంపీలు అభ్యంతర తెలిపారు. కిషన్ రెడ్డి తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలన్నారు. విభజన హామీలను కేంద్రం నెరవేర్చాలన్నారు. బీజేపీ ఇచ్చిన బయ్యారం స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్నారు. అంతకు ముందు మాట్లాడిన పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ తెలంగాణకు కేంద్రం బకాయిలు చెల్లించాలనన్నారు. ఏపీ చేపట్టిన బనకచర్లతో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. తెలంగాణకు రావాల్సిన 200 టీఎంసీల నీళ్లు ఏపీ డైవర్ట్ చేస్తుందని ఆరోపించారు. బనకచర్లతో వందలాది ఎకరాలు నీట మునుగుతదన్నారు. తెలంగాణ కష్టాల మీద ప్రధాని మోదీ దృష్టిపెట్టాలన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్‌పోర్టు మంజూరు చేయాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ అన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు కోసం రిక్వెస్ట్ చేశామన్నారు. పెద్దపల్లి జిల్లాకు ఎయిర్ పోర్టు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాంలో గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అంతర్గాం మండల కేంద్రంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం 591 ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక అందిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అక్కడ ఎయిర్ పోర్టు నిర్మాణం సాధ్యమవుతుందా అనే విషయమై ప్రీ ఫిజిబులిటీ స్టడీ చేసేందుకు రూ. 40.53 లక్షల ఫీజును ఎయిర్? పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ ఛీఫ్? సెక్రటరీ వికాస్? రాజ్ గతేడాదిలో ఉత్తర్వులు జారీ చేశారు.

## అమరావతి బిల్లును స్వాగతించిన మంత్రి పొన్నం

**తెలంగాణ హామీలు అమలు చేయాలని డిమాండ్**

ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లు.. లోక్‌సభలో ఆమోదం పొందడాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపారు. రాజధాని నిర్మాణం ద్వారా ఎపి పురోగమించాలని ఆకాంక్షించారు. తెలంగాణకు ఇచ్చిన విభజన హామీలను కూడా వెంటనే అమలు చేయాలని కేంద్రానికి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీల అమలులో కేంద్రం వివక్ష చూపుతోందని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం వంటి హామీలను ఇప్పటికీ నెరవేర్చలేదు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పింది. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు.

# నేడు నగరంలో హనుమాన్ శోభాయాత్ర

**3వేల మందితో పోలీస్ బందోబస్తు**

**హైదరాబాద్,ఏప్రిల్1 :** నగరంలో హనుమత్ జయంతికి భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇకపోతే గురువారం హనుమత్ జయంతి సందర్భంగా శోభాయాత్ర నిర్వహించడం ఏటా ఆనవాయితీగా వస్తోంది. ఏప్రిల్ 2న హనుమాన్ శోభాయాత్ర ప్రశాంతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సిటీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించాక పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకో కుండా సుమారు 3వేల మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నామన్నారు. యాత్ర నిర్వహణలో వలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. ఫ్లై ఓవర్లు, రైల్వే బ్రిడ్జిల వద్ద తగిన జాగ్రత్తలు పాటించాలని, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు మళ్లింపులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గౌలిగూడ రామమందిరాన్ని దర్శించుకున్న సీపీ సజ్జనార్ అక్కడి నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు ఉన్న 12 కిలోమీటర్ల శోభాయాత్ర మార్గాన్ని వాహనంపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో రోడ్లపై చెత్తాచెదారం, మట్టికుప్పలు, రాళు లేకుండా, రోడ్డుపైకి వచ్చే చెట్టుకొమ్మలు తొలగించే పనులు చేస్తున్నారు. ప్రజలు శాంతియుతంగా యాత్ర జరిగేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# మంగళ్‌హాట్ గోదాముపై దాడి

**హోటళ్లకు చచ్చిన మేకల మాంసం**

**కుళ్లిన పది టన్నుల మాంసం స్వాధీనం**

**హైదరాబాద్,ఏప్రిల్1 :** హైదరాబాద్ నగరంలో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మరో కల్తీ మాంసం ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రెండు గోదాములపై మెరుపు దాడులు నిర్వహించి సుమారు 10 టన్నుల కుళ్లిన మాంసాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గోల్కొండ టాస్క్‌ఫోర్స్, హెచ్-ఫాస్ట్, జీహెచ్ఎంసీ అధికారులు సంయుక్తంగా ఈ ఆపరేషన్

నిర్వహించారు. విశ్వసనీయ సమాచారం మేరకు మంగళ్‌హాట్‌లోని గోదాములపై దాడులు నిర్వహించగా, నిల్వ ఉంచిన భారీ మొత్తంలో ఈ కుళ్లిన మాంసం బయటపడింది. ఈ దందా వెనుక అఫ్రోజ్ అనే వ్యక్తి కీలలక సూత్రదారిగా వ్యవహరిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుడు జమ్ముకశ్మీర్, మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల నుంచి చనిపోయిన మేకలను తక్కువ ధరకు తెప్పించి, ఇక్కడ నిల్వచేస్తున్నట్లు విచారణలో తేలింది. ఈ కుళ్లిన మాంసాన్ని నగరంలోని వివిధ హోటళు, బిర్యానీ సెంటర్లకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో ప్రధాన నిందితుడు అఫ్రోజ్‌తో పాటు మొత్తం నలుగురిని అదుపులోకి తీసుకున్నారు పోలీసులు. ఈ ఘటనలో సదరు గోదాములను సీజ్ చేసిన అధికారులు.. నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల నగరంలో వరుసగా బయటపడుతున్న ఇలాంటి కల్తీ దందాల పట్ల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బయట ఆహారం తినేటప్పుడు, మాంసం కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

# మంత్రి పొంగులేటి అక్రమాలపై హౌజ్ కమిటీ కోరాం

**సిఐడి విచారణ జరిగితే తేలేదేమీ ఉండదు**

**కడియం ఏ పార్టీలో ఉన్నాడో తెలపాలన్నాం**

**ఇవన్నీ అడిగితే కేసులతో వేధింపులా**

**మీడియా సమావేశంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**



**హైదరాబాద్,ఏప్రిల్1 :** రాష్ట్రంలో జరిగే మైనింగ్ స్కామ్‌ను హరీశ్‌రావు అసెంబ్లీలో ఆధారాలతో సహా బయటపెట్టారని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. మైనింగ్ స్కామ్ మీద హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశామని పేర్కొన్నారు. హౌస్ కమిటీ వేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి ఏం సమస్య అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పాడి కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. దీనిపై సీఐడీ ఎంక్వైరీ వేస్తామని ప్రభుత్వం చెబుతోందని.. మంత్రి మీద సీఐడీ ఎంక్వైరీ వేస్తే న్యాయం ఎలా జరుగుతుందని ఆయన ప్రశ్నించారు. మంత్రిని సీఐడీ అధికారులు ప్రశ్నించే అవకాశం ఉంటుందా అని పాడి కౌశిక్ రెడ్డి అడిగారు. అందుకే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశామని తెలిపారు. అయితే దానం నాగేందర్; కడియం శ్రీహరితో ముఖ్యమంత్రి మాట్లాడించారని చెప్పారు. దానం నాగేందర్ నోటికొచ్చినట్లు మాట్లాడి బెదిరించారని తెలిపారు. అన్నం పెట్టిన కేసీఆర్ గురించి కడియం శ్రీహరి తప్పుగా మాట్లాడారని పాడి కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. కడియం శ్రీహరికి కేసీఆర్ ఏం తక్కువ చేశారని ప్రశ్నించారు. సిట్టింగ్‌ను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకే నువ్వు ఏ పార్టీలో ఉన్నావని కడియం శ్రీహరిని అడిగామని తెలిపారు. తనతోపాటు బీఆర్ఎస్ సభ్యులందరూ అడిగారని,ఇది తప్పా అని నిలదీశారు. కాంగ్రెస్ వాళ్ల దగ్గర ఎందుకు కూర్చున్నావని ప్రశ్నించాం.. అది తప్పా అని ప్రశ్నించారు. నువ్వు ఏ పార్టీ పక్షాన మాట్లాడుతున్నావని

కడియం శ్రీహరిని అడిగామన్నారు. కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యే అందరూ నన్ను టా÷-గ్గ్÷ట్ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజల పక్షాన నిలబడినందుకు తనను టార్గెట్ చేశారని అన్నారు. నిరుద్యోగుల పక్షాన ఉద్యోగాలు అడిగినందుకు టార్గెట్ చేస్తున్నావా అని ప్రశ్నించారు. పెన్షన్లు ఎందుకు పెంచలేదని ప్రశ్నిస్తే టార్గెట్ చేస్తున్నావా అని నిలదీశారు. ప్రజల కోసం పోరాడుతున్నందుకే తన గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఎథిక్స్ కమిటీకి కాంగ్రెస్ నేతల తిట్లు కనిపించవా అని ప్రశ్నించారు. దానం తిట్లు ఎథిక్స్ కమిటీకి రావా అని అడిగారు. అసెంబ్లీలో కాంగ్రెస్ నేతలు మాట్లాడిన బూతులు అందరూ చూశారని తెలిపారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్‌లో ఉంటే కేసీఆర్, హరీశ్‌రావును ఎందుకు విమర్శించారని ప్రశ్నించారు. హామీలపై మేం ప్రశ్నిస్తే మమ్మల్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టార్గెట్ చేశారని తెలిపారు. ఎన్ని ఇబ్బందులు పెట్టినా ప్రజల కోసం పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అవినీతిని బయటపెడితే ప్రభుత్వం స్పందించడం లేదని కోరుట్ల ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్ మండిపడ్డారు. మైనింగ్‌పై జరుగుతున్న అవినీతిపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. సభాసంఘం వేయాలని అసెంబ్లీలో బీఆర్ఎస్ డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. నిజమైన నాయకులంటే పార్టీ లైన్‌లో ఉండాలి.. కానీ పార్టీ మారిన మనిషిని మీ భుజాల మీద ఎత్తుకుంటున్నారని మండిపడ్డారు.. తోటి శాసనసభ్యుడిని తిట్టేందుకు మంత్రులకు మైక్‌లు ఇచ్చారని అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మంత్రులు ఒక్కరైనా స్జబెక్ట్ మాట్లాడారా అని ప్రశ్నించారు. స్వర్ణకారుల కష్టాల గురించి ఒక్కరైనా మాట్లాడారా అని అడిగారు. అవినీతి మంత్రిని, పార్టీ మారిన వ్యక్తిని వెనుకేసుకొచ్చారని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయితే మా వెనుకాల కూర్చోవాలి కదా అని ప్రశ్నించారు. కడియం శ్రీహరి వంటి నాయకుడి మీరు వెనుకేసుకొస్తారా అని కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కడియం శ్రీహరి ఏ పార్టీ అని మేం తప్పకుండా అడుగుతామని తెలిపారు. తొలిసారి అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలు రాజ్యాంగ విలువలు కాపాడాలని సూచించారు. అసెంబ్లీలో చర్చ చూసి పిల్లలు నవ్వుకుంటున్నారని అన్నారు. సభలో పాలసీల గురించి మాట్లాడుతున్నామా? అని అడిగారు. మనం చర్చించాల్సింది ప్రజల సమస్యల గురించి మాత్రమే అని స్పష్టం చేశారు.

# రేషన్ కార్డుల తొలగింపు దుర్మార్గపు చర్య

**5లక్షలు ఇచ్చామని చెప్పి 15లక్షలు తొలగించే కుట్ర**

**ప్రభుత్వ తీఈరుపై మండిపడ్డ జాగృతి అధ్యక్షురాలు కవిత**



**హైదరాబాద్,ఏప్రిల్1 :** రాష్ట్రంలో పేదలను రేవంత్ రెడ్డి సర్కార్ వేధిస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మండిపడ్డారు. రేషన్ కార్డుల విషయంలో పేదలకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రేషన్ కార్డుల ఏరివేత అనే దుర్మార్గపు చర్యలను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయాలని కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై కవిత సీరియస్ అయ్యారు. పేదలకు అన్యాయం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆగ్రహించారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని కవిత విమర్శించారు. 5 లక్షల రేషన్ కార్డులు ఇచ్చామని చెప్పుకుంటూ.. మరోవైపు 15 లక్షల కార్డులు తొలగించే ప్రయత్నం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. ఐటీ రిటర్న్స్ ఫైల్ చేయడం, ప్రైవేట్ ఉద్యోగాలు చేయడం వంటి కారణాలతో కార్డులు తీసేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలకు ఉపయోగపడే రేషన్ కార్డుల విషయంలో ఇలాంటి చర్యలు మానుకోవాలని హితవుపలికారు. కొండగట్టు చలువ పందిళ్ల ప్రమాదంపైనా కవిత స్పందించారు. పనుల్లో తీవ్ర నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. కొండగట్టు అంజన్న ఆలయంలో చలువ పందిళ్లు కూలి 15 మంది గాయపడడంపై విచారం వ్యక్తం చేశారు. హనుమాన్ చిన్న జయంతి వేడుకల కోసం నాసిరకం పందిళ్లు వేయడంతోనే ప్రమాదం జరిగిందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఉత్సవాల సమయంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. గాయపడిన భక్తులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలన్నారు. ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# జిఎస్టీ వసూళ్లలో 8,8శాతం వృద్ధి

**మార్చిలో రూ.2 లక్షల కోట్ల మేర వసూళ్లు**

**హైదరాబాద్,ఏప్రిల్ 1 :** దేశంలో జీఎస్టీ వసూళ్లు నెలనెలా భారీగా వసూలు అవుతున్నాయి. దీంతో కేంద్రానికి భారీగా ఆదాయం సమకూరుతోంది. దేశంలో స్థూల వస్తు, సేవల పన్ను వసూళ్లు భారీగా నమోదయ్యాయి. మార్చి నెలకు గానూ 8.8 శాతం వృద్ధితో రూ. 2 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాలు పెరగడం, దిగుమతుల కారణంగా పన్ను వసూళ్లు ఈస్థాయిలో పెరిగినట్లు ప్రభుత్వ గణాంకాలను బట్టి తెలుస్తోంది. గతేడాది మార్చిలో జీఎస్టీ వసూళ్లు రూ. 1.83 లక్షలుగా నమోదయ్యాయి. దేశీయంగా విక్రయాల ద్వారా 5.8 శాతం వృద్ధితో రూ. 1.46 లక్షల కోట్ల మేర జీఎస్టీ ఆదాయం సమకూరగా.. దిగుమతుల రూపంలో 17.8 శాతం వృద్ధితో రూ. 53,861 కోట్ల వసూళ్లు నమోదయ్యాయి. రిఫండ్ల సర్దుబాటు అనంతరం నికరంగా జీఎస్టీ వసూళ్లు రూ. 1.78 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది. 2025-26 ఆర్థిక సంవత్సరం మొత్తానికి 8.3 శాతం వృద్ధితో జీఎస్టీ వసూళ్లు రూ. 22.27 లక్షల కోట్లుగా నమోదైనట్లు కేంద్రం వెల్లడించింది.

## రెండు పంచాయితీలకు వికాస్ పురస్కారాలు

**హర్షం వ్యక్తం చేసిన మంత్రి సీతక్క**

**న్యూఢిల్లీ,ఏప్రిల్1 :** గ్రామీణాభివఅద్ధి, సుస్థిర పరిపాలనలో విశిష్ట ప్రతిభ కనబరిచిన తెలంగాణ పంచాయతీలకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక గుర్తింపు లభించింది. కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ప్రకటించిన 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ పంచాయత్ సతత్ వికాస్ పురస్కారాలు' రాష్ట్రంలోని రెండు గ్రామ పంచాయతీలను వరించాయి. వికారాబాద్ జిల్లా కోటేపల్లి మండలానికి చెందిన మోతుకుపల్లి గ్రామ పంచాయతీ 'గుడ్ గవర్నెన్స్' విభాగంలో జాతీయ అవార్డును దక్కించుకోగా, సంగారెడ్డి జిల్లా సంగారెడ్డి మండల పరిధిలోని ఫసల్వాడి గ్రామ పంచాయతీ 'విమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ' విభాగంలో అత్యుత్తమ పురస్కారాన్ని సాధించింది. గ్రామ స్థాయిలో అత్యంత పారదర్శకమైన పరిపాలన అందించడం, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వామ్యం చేయడం , మహిళా సాధికారత, భద్రత, సంక్షేమ కార్యక్రమాల అమలులో చూపిన అసాధారణ కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. జాతీయ స్థాయిలో తెలంగాణ పంచాయతీలకు ఈ గౌరవం దక్కడం పట్ల రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణాభివృద్ధి, పారదర్శక పాలన , మహిళా సాధికారత దిశగా తమ ప్రభుత్వం తీసుకుంటున్న పటిష్టమైన చర్యలకు ఈ అవార్డులే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. ఈ అద్భుత విజయాన్ని సాధించిన మోతుకుపల్లి, ఫసల్వాడి గ్రామ పంచాయతీల ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది , గ్రామస్థులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఇలాంటి విజయాలు రాష్ట్రంలోని ఇతర పంచాయతీలకు గొప్ప ప్రేరణగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని గ్రామాలు అభివృద్ధి బాటలో నడిచి జాతీయ స్థాయిలో తెలంగాణ కీర్తిని చాటాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు.

## కొండగట్టు ఆలయంలో అపశృతి

**చలువ పందిళ్లు కూలి 15మందికి గాయాలు**

**జగిత్యాల,ఏప్రిల్1 :** జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు ఆంజన్న ఆలయంలో అపశ్రుతి నెలకొంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలి 15 మంది భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాసిరకంగా ఏర్పాట్లు చేయడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని ఆరోపిస్తున్నారు. హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో హనుమాన్ మాల విరమణ కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఈ క్రమంలో ఆలయంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు కూడా వేశారు. ఈ క్రమంలో నాసిరకంగా వేయడంతో చలువ పందిరి కూలిపోయిందని భక్తులు ఆరోపిస్తున్నారు.




# ప్రపంచానికి ఒరాకిల్ భారీ కుదుపు

**30వేల మంది టెక్కీల తొలగింపు.. అందులో 12వేమంది భారీతయులు**

**న్యూయార్క్:** అమెరికా టెక్ దిగ్గజం ఒరాకిల్ మంగళవారం ఒక్కసారిగా భారీ లేఆఫ్స్‌కు శ్రీకారం చుట్టింది. ప్రపంచవ్యాప్తంగా పనిచేస్తున్న సుమారు 1.62 లక్షల మంది సిబ్బందిలో 18 శాతం, అంటే దాదాపు 30,000 మందిని తొలగించినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 12,000 మంది భారతదేశానికి చెందిన ఉద్యోగులే కావడం గమనార్హం. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 6 గంటలకు వేలాది మంది ఉద్యోగులకు ఒకేసారి లేఆఫ్ మెయిల్స్ పంపించారు. కంపెనీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా వారి రోల్స్ అవసరం లేదని పేర్కొంటూ తొలగింపు ఉత్తర్వులు జారీ చేశారు. మార్చి 31నే వారి చివరి పనిదినంగా ప్రకటించడంతో పాటు, కంపెనీ ల్యాప్‌టాప్‌లు, సిస్టమ్‌ల యాక్సెస్‌ను వెంటనే నిలిపివేయడం ఉద్యోగులకు షాక్ ఇచ్చింది. ఈ లేఆఫ్స్ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడింది. ఒరాకిల్ ఇండియాలో సుమారు 30,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో గణనీయమైన శాతం ఈ కోతలకు గురైనట్లు సమాచారం. అమెరికా, కెనడాలో తొలగించిన ఉద్యోగుల్లో కూడా పెద్ద సంఖ్యలో భారతీయులే ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేనేజీరియల్ స్థాయిలో ఉన్న ఉద్యోగులే ఎక్కువగా ఈ వేటుకు గురైనట్లు సమాచారం. ఇది ఒక్క విడత మాత్రమేనని, ఇంకా మరిన్ని లేఆఫ్స్ ఉండే అవకాశం ఉందన్న వార్తలు ఉద్యోగుల్లో ఆందోళన పెంచుతున్నాయి. ఏ సమయంలోనైనా మరో చేదు వార్త వినాల్సి వస్తుందేమోనని

ఐటీ ఉద్యోగులు టెన్షన్ పడుతున్నారు. ఒరాకిల్ ప్రస్తుతం నష్టాల్లో లేదు. ఇటీవల ముగిసిన త్రైమాసికంలో కంపెనీ లాభాలు గత ఏడాదితో పోలిస్తే 95శాతం పెరిగి 6.13 బిలియన్ డాలర్లకు చేరాయి. అయితే, కంపెనీ ఇప్పుడు ఏఐ డేటా సెంటర్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టుతోంది. సుమారు 156 బిలియన్ డాలర్ల ప్రాజెక్ట్ చేపట్టగా, అందులో భాగంగా ఇప్పటికే 50 బిలియన్ డాలర్లు అప్పు తీసుకుంది. ఈ నేపథ్యంలో ఖర్చులను తగ్గించేందుకు ఉద్యోగాల కోతలు విధిస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్యల ద్వారా కంపెనీకి దాదాపు 10 బిలియన్ డాలర్ల వరకు నగదు ఆదా అవుతుందని అంచనా. ఇక తొలగించిన ఉద్యోగులకు కంపెనీ కొన్ని పరిహారాలు ప్రకటించింది. అదనంగా మూడు నెలల జీతం,కంపెనీలో పని చేసిన ప్రతి ఏడాదికి 15 రోజుల జీతం, మిగిలిన సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం,కార్మిక చట్టాల ప్రకారం గ్రాట్యుటీ.అయితే, ఈ ప్రయోజనాలు కంపెనీ నిర్దేశించిన గడువులోపు రాజీనామా చేసిన వారికే వర్తిస్తాయని పేర్కొన్నారు.

# ఇరాన్‌పై 800 సార్లు యుద్ధ విమానాల దాడి

**16వేలకు పైగా బాంబులు వేసిన ఫైటర్లు.. వెల్లడించిన ఇజ్రాయిల్ మిలిటరీ శాఖ**

**న్యూఢిల్లీ :** దాదాపు నెల రోజులకు పైగా ఇరాన్, దాని మిత్ర దేశాలపై అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది. ఈ దాడులకు సంబంధించిన వివరాలను తాజాగా ఐడీఎఫ్ పంచుకుంది. యుద్ధం ప్రారంభమైన నాటినుంచి ఇప్పటివరకు 800 సార్లు తమ యుద్ధ విమానాలు ఇరాన్ పైకి దూసుకెళ్లాయని ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఈ ఫైటర్‌జెట్లు 16వేలకు పైగా బాంబులను జారవిడిచినట్లు తెలిపింది. ఇరాన్ ప్రముఖ నాయకులు, మిలిటరీ కమాండర్లు, హెడ్‌క్వార్టర్లు, అణు స్థావరాలు, ఆయుధ తయారీ కేంద్రాలు, బాలిస్టిక్ క్షిపణి లాంచర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేశాం. యుద్ధం మొదలైన నాటినుంచి 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేశాం. దాదాపు 16వేల బాంబులను జారవిడిచాం. ఈ దాడుల్లో ఇరాన్‌కు చెందిన 2వేల మందికి పైగా సైనికులు, కమాండర్లు హతమయ్యారు. కేవలం 40 సెకన్లలోనే 40 మందికి పైగా సీనియర్ అధికారులను అంతమొందించాం అని ఐడీఎఫ్ వెల్లడించింది. మరో 5వేల కొత్త టార్గెట్లను కూడా గుర్తించినట్లు తెలిపింది. ఇరాన్, దాని అనుబంధ గ్రూప్‌లు తమపై బెదిరింపులకు పాల్పడుతున్నాయని, వాటిని అడ్డుకోవడమే తమ లక్ష్యమని ఐడీఎఫ్ పునరుద్ఘాటించింది. మరోవైపు అమెరికా సెంట్రల్ కమాండ్ కూడా యుద్ధంపై స్పందించింది. ఇరాన్‌లోని భూగర్భ లక్ష్యాలను కూడా ఛేదించినట్లు వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఓ వీడియోను తాజాగా విడుదల చేసింది.

# యుద్ధం ముగింపునకు సిద్ధమే

**షరతులు వర్తిస్తాయనన ఇరాన్**



**టెహ్రాన్ :** అమెరికా- ఇజ్రాయెల్‌తో కొనసాగుతోన్న యుద్ధాన్ని ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ పేర్కొన్నారు. అయితే, తమకు కొన్ని బలమైన హామీలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టాతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారని ఇరాన్ అధ్యక్ష కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. యుద్ధం ముగించాలంటే తాము విధించిన షరతులకు అంగీకరించాలని ఇరాన్ అధ్యక్షుడు పేర్కొన్నారు. ముఖ్యంగా భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కావనే బలమైన హామీ ఇవ్వాలన్నారు. అప్పుడు ఈ యుద్ధం ముగించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. ఇరాన్ అధ్యక్షుడితో జరిగిన సంభాషణ తర్వాత ఆంటోనియో కోస్టా సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా ఉందని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. పరిస్థితిని చక్కదిద్దేందుకు గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులను తగ్గించుకోవాలని కోరారు. దౌత్య మార్గాలతో సమస్యను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం గురించి ప్రస్తావించారు. అమెరికా ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్కాఫ్ నుంచి తనకు నేరుగా సందేశాలు అందుతున్నాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ పేర్కొన్నారు. అయితే, ఆ దేశంతో చర్చలు జరుపుతున్నామనేది దాని ఉద్దేశం కాదన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. కొన్ని సందేశాలు మధ్యవర్తుల ద్వారా కూడా వచ్చాయన్నారు. యూఎస్‌తో తాము ఎలాంటి అధికారిక చర్చలు జరపడం లేదని.. ఆ దేశం చేసిన ప్రతిపాదనలపై తాము ఇంకా స్పందించలేదని వెల్లడించారు. కాల్పుల విరమణకు తాము అంగీకరించమని.. యుద్ధం ముగింపును మాత్రమే తాము కోరుకుంటున్నామని అరాగ్చీ స్పష్టం చేశారు.

# అసోంలో హ్యాట్రిక్ ఖాయం

**అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీజేపీదే గెలుపు**

**గత పదేళ్ల పాలన సుపరిపాలన యుగం**

**అధికారంలోకి రాగానే యూసీసీ అమలు**

**గోగాముఖ్ ఎన్నికల సభలో ప్రధాని మోడీ**



**గువాహటి:** అసోంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ విజయాన్ని సాధిస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ప్రస్తావిస్తూ, కాంగ్రెస్ స్వయం ప్రకటిత యువరాజుకు ఓటముల సెంచరీ పూర్తిచేసే సందర్భం అవుతుందని ఎద్దేవా చేశారు. అసోంలో గత పదేళ్ల బీజేపీ పాలనా కాలాన్ని సేవ, సుపరిపాలన యుగంగా అభివర్ణించారు. అసోంలోని గోగాముఖిలో జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ ఈ మేరకు వ్యాఖ్యానించారు. అసోంలో యూసీసీని అమలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విభజన రాజకీయాలను అనుసరిస్తోందని ఆరోపించారు. సమాజంలో విభజనలు సృష్టించగల చట్టాన్ని గతంలో కూడా ఆ పార్టీ ప్రవేశపెట్టేందుకు ప్రయత్నించిందని మండి పడ్డారు. ఆదివాసీ హక్కులను కాపాడతామని ఓటర్లకు హామీ ఇచ్చారు. ప్రస్తుత యువతరం బీజేపీ సుపరిపాలనను మాత్రమే చూశారే తప్ప, కాంగ్రెస్ పార్టీ చీకటి పాలనను చూడలేదన్నారు. గత దశాబ్దకాలంలో అసోం అభివృద్ధిలో ఒక సుదీర్ఘ ప్రయాణాన్ని పూర్తి చేసిందన్నారు. గత పదేళ్ల కాలంలో అసోంకు చెందిన వేలాది మంది యువత తుపాకులను పక్కన పెట్టి భవిష్యత్తుపై దృష్టిసారించారని, కాంగ్రెస్ తన పాలనలో మౌలిక సదుపాయాల లోపాలను సరిదిద్దడంలో విఫలమైందని ఆరోపించారు. బీజేపీ పాలన లో అసోం సాధించిన అభివృద్ధిని, కమలం పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలోని అంశాలను ప్రధాని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రజల నుంచి లభిస్తున్న విస్తృత మద్దతు, ఉత్సాహమే అసోం ఎన్నికల్లో వరుసగా మూడోసారి బీజేపీ సర్కార్ అధికారంలోకి రాబోతుందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా రాష్ట్రంలోని 15 లక్షలకు పైగా కుటుంబాలు లబ్ధి పొందుతాయని, అలాగే పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామని చెప్పారు. లఖ్పతి దీదీ పథకం ద్వారా 40 లక్షల మహిళలకు ప్రయోజనం చేకూర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామని స్పష్టం చేశారు. కాగా, అసోంలో ఉన్న 126 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే దశలో ఏప్రిల్ 9న పోలింగ్ జరగనుంది. మే 4న ఫలితాలు వెల్లడిస్తారు.

## తేయాకు తోటలో మోడీ

**మహిళా కార్మికులతో సంభాషణ**

**వారి యోగక్షేమాలపై ఆరా.. సెల్ఫీలు**

**చెరిగిపోని మధుర జ్ఞాపకంగా అభివర్ణన**

**కార్మికుల శ్రమ, సంస్కృతికి ప్రశంసలు**

అసోం ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోడీ బుధవారం డిబ్రూఘర్లో పర్యటించారు. ఉదయం స్థానికంగా ఉన్న మనోహరం అనే టీ గార్డెన్కు వెళ్లారు. స్థానిక మహిళా కార్మికులతో కలిసి ఆయన తేయాకును తెంపారు. టీ గార్డెన్ వర్కర్లు ప్రధాని మోడీతో కలిసి సెల్ఫీ కూడా దిగారు. ఈ సందర్భంగా మహిళా కార్మికులతో ప్రధాని ముచ్చటించారు. వారి సమస్యలు, జీవనశైలి గురించి అడిగితెలుసుకున్నారు. విద్య, ఆరోగ్యం వేతనాలు వంటి అంశాలను ఆరా తీశారు. మహిళలు ప్రదర్శించిన సాంప్రదాయ ఝుముర్ నృత్యం తిలకించారు.

అనంతరం ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ఈ అనుభవం ఎప్పటికీ మరచిపోలేనిదని అభివర్ణించారు. తేయాకు లేదా టీ అనేది అసోం ఆత్మ, ఇక్కడి టీ ప్రపంచం నలుమూలలకు వెళ్తుంది. ఈ ఉదయం డిబ్రూఘర్లోని తేయాకు తోటలో మహిళా కార్మికులతో సంభాషించిన క్షణాలు ఎప్పటికీ గుర్తుండిపో యే అనుభవం అని పేర్కొన్నారు. అలాగే టీ గార్డెన్ కుటుంబాల శ్రమ, సంస్కృతిని ప్రశంసించారు. టీ గార్డెన్ కుటుంబాలు అసోంకు గర్వకారణమని కొనియాడారు.

# సోషల్ మీడియా వేదికగా వ్యతిరేక పోస్టులపై ఆంక్షలు

**బిల్లు తీసుకు రాబోతున్న కేంద్ర ప్రభుత్వం**



**న్యూఢిల్లీ :** సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెడితే.. ఇకపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం సమాయత్తమవుతోంది. అలాంటి పోస్టులు పెట్టే వారికి నేరుగా కేంద్రం నోటీసులు జారీ చేయనుంది. అలాగే ఆ పోస్ట్‌ను షేర్ చేసే వారిపై సైతం కఠిన చర్యలు తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమిస్తోంది. అందుకోసం దేశ భద్రత పేరిటి కొత్త ప్రతిపాదనలను కేంద్రం తీసుకు వస్తుంది. అందుకోసం ఐటీ రూల్స్ సవరణకు కేంద్రం ఇప్పటికే సిద్ధమైంది. దాంతో కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై సోషల్‌మీడియా ఖాతాలో ఏదైనా వ్యతిరేక పోస్టు పెడితే ఇక చట్ట పరమైన శిక్షలు తప్పవు. ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఫేస్‌బుక్ వంటి సోషల్‌మీడియా వేదికల ద్వారా ఇకపై ఏదైనా పోస్ట్ చేస్తే, ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్ మంత్రిత్వ శాఖల నుంచి నోటీసులు అందుకునే అవకాశం ఉంది. ఇక ఆన్‌లైన్ వేదికలపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే యూజర్ల, కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్ఫ్లూయెన్సర్లను సైతం న్యూస్ పబ్లిషర్లుగానే ఇకపై కేంద్రం చూడబోతున్నదన్నది స్పష్టం కానుంది. మైనా అభ్యంతరకర పోస్టులు పెడితే.. నేరుగా యూజర్లకే నోటీసులు పంపాలనే సమాలోచన కేంద్రం చేస్తోంది. ఈ మేరకు ఐటీ నిబంధనలతోపాటు 2021లో కొన్ని సవరణలు ప్రతిపాదిస్తూ సోమవారం కేంద్రం ముసాయిదా నిబంధనలను విడుదల చేసింది. దీనిపై ఏప్రిల్ 14వ తేదీ నాటికి అభిప్రాయాలు తెలియజేయాల్సి ఉందని కేంద్రం స్పష్టం చేసింది.

# దశాబ్దాలుగా ప్రజలను మోసం చేస్తున్న కూటములు

**రెండు కూటములను సాగనంపండి**

**కేరళ ప్రచారంలో రాజ్‌నాథ్ సింగ్ పిలుపు**

**తిరువనంతపురం :** కేరళంలోని కష్టజీవులు, నిజాయతీపరులైన ప్రజలను దశాబ్దాలుగా లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్, యునైటెడ్ డెమొక్రటక్ ఫ్రంట్‌లు వంచిస్తున్నాయని, రెండు కూటమిల్లో ఎవరో ఒకరిని ఎంచుకోవడం కాకుండా రెండింటినీ ఇంటికి సాగనంపాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పరవూర్ నియోజకవర్గంలో బుధవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. ఎల్డీఎఫ్, యూడీఎఫ్ జెండాలు, గుర్తులు వేరైనప్పటికీ వాటి ప్రవర్తన, క్యారెక్టర్ ఒకటేనని చెప్పారు. ఆలోచనా ధోరణి కూడా ఒకటేనన్నారు. సమాజాన్ని విడగొట్టడం, కేరళం ఆర్థిక వ్యవస్థను పతనం చేయడం కోసం పనిచేస్తుంటాయని విమర్శించారు. ఎల్డీఎఫ్ అంటే లూటీలు, విభజనలు, వైఫల్యం(లూట్, డివిజన్, ఫెయిల్యూర్) అని రాజ్‌నాథ్ నిర్వచించారు. యూడీఎఫ్‌ను నమ్మదగని, నిజాయతీలేని, మోసపూరితమైనది(అన్‌ట్రస్ట్‌వర్తీ, డిసానెస్టీ, ఫ్రాడ్)గా రాజ్‌నాథ్ అభివర్ణించారు. రెండిట్లోనూ 'ఎఫ్' అనేది కామన్ అనీ, 'ఫ్రంట్' అంటే కరప్షన్ అని ఘాటుగా విమర్శించారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ఈ సారి కేరళం ఎన్నికల్లో ఎల్డీఎఫ్, యూడీఎఫ్‌కు గట్టి సవాల్ విసిరేందుకు ప్రచారం ముమ్మరం చేస్తోంది. సీపీఎం సారథ్యంలోని ఎల్డీఎఫ్ దశాబ్ద కాలంగా అధికారంలో ఉంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ సారథ్యంలో ఎల్డీఎఫ్ కూటమి మరోసారి అధికారంలోకి వచ్చేందుకు పట్టుదలగా ఉంది. కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ పినరయి విజయన్ వైఫల్యాలను ఎండగడుతూ ఈ సారి 100 సీట్లలో తమ గెలుపు ఖాయమంటూ ప్రచారం సాగిస్తోంది. కాగా, బీజేపీ ఓట్ షేర్ కొన్నేళ్లుగా గణనీయంగా పెరిగిందని, ఓటర్లు ఇప్పుడు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని ఎన్డీయే అభ్యర్థి అనూప్ ఆంటోని తెలిపారు. కాగా, కేరళం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఒకే విడతలో ఏప్రిల్ 9న జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

# రష్యాలో కుప్పకూలిన సైనిక విమానం

**29మంది దుర్మరణం చెందినట్లు ధృవీకరణ**




**మాస్కో :** క్రిమియాలో ఘోర విమాన ప్రమాదం జరిగింది. రష్యాకు చెందిన సైనిక విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో 29 మంది దుర్మరణం చెందారు. ఆంటోనోవ్- 26 మోడల్‌కు చెందిన విమానం స్థానిక కాలమాన ప్రకారం మంగళవారం సాయంత్రం 6 గంటలకు క్రిమియా ద్వీపకల్పం మీదుగా వెళ్తోంది. అదే సమయంలో ఆ విమానానికి రాడర్‌తో సంబంధాలు తెగిపోయాయి. అయితే ఆ విమానం ఒక కొండను ఢీకొని కూలిపోయినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో విమానంలో 23 మంది సైనికులు, ఆరుగురు సిబ్బంది ఉండగా.. వారందరూ మృతిచెందారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సాంకేతిక సమస్య కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ప్రాథమిక అంచనా వేసింది. విమానంపై దాడి జరిగింది అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది. ప్రమాదానికి గల కారణాలు తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపింది. ప్రమాదానికి గురైన ఆంటో నోవ్ ఎన్-26 విమానాలను 1960 చివరలో ప్రవేశపె ట్టారు. వీటని సైనిక అవసరాలతో పాటు సరుకు రవాణా కు ఉపయోగిస్తుంటారు. అయితే ఈ మోడల్‌కు చెందిన విమానాలు గత కొన్నేళ్లుగా ప్రమాదాలకు గురవు తున్నాయి. ఇదే ఏడాది దక్షిణ సూడాన్‌లో జరిగిన ప్రమా దంలో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. 2022లో ఉక్రెయిన్‌లో జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. 2020లో శిక్షణ విమానం కూలి 20 మంది మరణించారు.



# 3కోట్ల ఫుట్‌ఫాల్స్ దాటేసన దురంధర్-2

రణ్‌వీర్ సింగ్ నటించిన 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డుల దిశగా దూసుకుపోతోంది. వసూళ్లలోనే కాకుండా, థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య (ఫుట్‌ఫాల్స్) విషయంలో కూడా ఈ సినిమా బాలీవుడ్‌లో సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో 3 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను దాటేసింది. కరోనా తర్వాత ఈ ఘనత సాధించిన ఆరో హిందీ చిత్రంగా 'ధురంధర్ 2' నిలిచింది. గతంలో 'గదర్ 2', 'జవాన్', స్త్రీ 2, ఛావా, 'ధురంధర్' మొదటి భాగం మాత్రమే ఈ మార్కును చేరుకున్నాయి. ప్రస్తుతం హిందీ వెర్షన్లలో అత్యధిక ఫుట్‌ఫాల్స్ సాధించిన చిత్రంగా 'పుష్ప 2' (దాదాపు 4 కోట్లు) కొనసాగుతోంది. అయితే, 'ధురంధర్: ది రివెంజ్' హవా చూస్తుంటే.. ఫుల్ రన్ ముగిసే సమయానికి అన్ని భాషల్లో కలిపి 5 కోట్ల ఫుట్‌ఫాల్స్‌ను సాధించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. ఈ రెండు భాగాలు కలిపి మొత్తం 8 కోట్లకు పైగా టికెట్లు అమ్ముడవడం అనేది భారతీయ సినిమా చరిత్రలో ఒక అసాధారణమైన విజయంగా రికార్డు సృష్టించనుంది. కలెక్షన్ల పరంగా 'ధురంధర్ 2' సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. విడుదలైన 13వ రోజు కూడా ఈ చిత్రం అద్భుతమైన వసూళ్లను సాధించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా రూ. 1400 కోట్ల మార్కును దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా చరిత్ర సృష్టించింది. భారతదేశంలో ఈ సినిమా ఇప్పటివరకు రూ. 899 కోట్ల నెట్ వసూళ్లను సాధించగా, బుధవారం మార్నింగ్ షోలతో రూ. 900 కోట్ల మైలురాయిని చేరుకుంది. రెండో వీకెండ్‌లో రూ. 170 కోట్లు వసూలుచేయడంతో భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక రెండో వారాంతపు వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది.

# నాని.. ఆ మాస్ లుక్



నేచురల్ స్టార్ నాని సాధారణంగా చాలా కూల్ గా కనిపిస్తుంటారు. కానీ ఈ మధ్య తన బాడీ లాంగ్వేజ్‌ను, రూపాన్ని పూర్తిగా మార్చేస్తున్నారు. ప్రస్తుతం జిమ్‌లో చేస్తున్న కసరత్తులు చూస్తుంటే నాని ఏదో పెద్ద అద్భుతం చేయబోతున్నారని అర్థమవుతోంది. సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక ఫోటో ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. నిశ్శబ్దంగా కష్టపడుతూ.. ఒక తుఫానును సిద్ధం చేస్తున్నట్లు నాని పెట్టిన పోస్ట్ వైరల్ అవుతోంది. ప్రస్తుతం నాని పూర్తి ఫోకస్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ద ప్యారడైజ్' మీద ఉంది. ఈ సినిమా కోసం నాని తన ఫిట్నెస్ ని పెంచి, ఒక రగ్గడ్ లుక్ లోకి మారిపోయారు. న్యూ హెయిర్ స్టైల్, గుబురు గడ్డంతో ఒక పక్కా మాస్ అవతారంలో కనిపిస్తున్నారు. ఒక రకంగా చెప్పాలంటే నాని తన కెరీర్ లోనే అత్యంత ఇంటెన్స్ లుక్ లో కనిపించనున్నట్లు అర్థమవుతోంది. ఈ ఏప్రిల్ నెలలో ఆయన చేస్తున్న ఈ బాడీ మేకోవర్ కేవలం ఒక సినిమా కోసమే కాదు, తన ఇమేజ్‌ను మరో మెట్టు ఎక్కించే ప్రయత్నం అని చెప్పొచ్చు. ఇక నాని ముందు ఒక పెద్ద సవాల్ ఉంది. ఒకవైపు 'ద ప్యారడైజ్' కోసం పూర్తి మాస్ గా మారుతూనే, మరోవైపు సుజిత్ తో చేయ-ంబోయే 'బ్లడీ రోమియో' కోసం స్టైలిష్ గా కనిపించాల్సి ఉంటుంది. ఈ రెండు సినిమాల మధ్య ఉండే కాంట్రాస్ట్ చాలా ఎక్కువ. 'జడల్' అనే క్యారెక్టర్ లో ఉండే ఆ రఫ్ లుక్ నుంచి సుజిత్ మార్క్ అల్ట్రా మోడరన్ లుక్ కి మారడం అనేది నానికి ఒక మెంటల్ షిఫ్ట్ అని చెప్పాలి. అందుకే ఆయన ఏప్రిల్ నుంచి జూన్ వరకు తనను తాను ఫిజికల్ గా పూర్తి స్థాయిలో సిద్ధం చేసుకుంటున్నారు. శ్రీకాంత్ ఓదెల సినిమాలో ఉండే ఆ మాస్ ఫ్లేవర్ కు తగ్గట్లుగా నాని ఇప్పుడు తన ఫిజిక్ ను ట్యూన్ చేసుకుంటున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన 'ఆయా షేర్' సాంగ్ తో నాని క్రేజ్ పాన్ ఇండియా లెవల్లో పాకిపోయింది. ఒక సామాన్య నటుడి నుంచి ఒక యాక్షన్ హీరోగా ఎదగడానికి నాని ఎంచుకున్న మార్గం ఇది. జిమ్ లో చెమట చిందిస్తూ చేస్తున్న ఈ కసరత్తులు ద ప్యారడైజ్ లోని యాక్షన్ సీక్వెన్సుల కోసం అని స్పష్టంగా తెలుస్తోంది.

# 10న వస్తున్న లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ



తమిళ యువ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో తెరకెక్కిన సరికొత్త చిత్రం 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. ఈ సినిమాలో టాలీవుడ్ బ్యూటీ కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పటికే సెన్సార్ పనులు పూర్తి చేసుకుని సర్టిఫికెట్ అందుకున్న ఈ చిత్రం, అనేక వాయిదాల తర్వాత ఏప్రిల్ 10న తమిళంతో పాటు తెలుగులోనూ గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా తెలుగులో టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ టీజర్ విషయానికి వస్తే.. ఇది 2040వ సంవత్సరం నేపథ్యంలో సాగే ఒక ఆసక్తికరమైన ఫ్యూచరిస్టిక్ రొమాంటిక్ డ్రామాగా కనిపిస్తోంది. ప్రస్తుత కాలంలోని ఇన్‌స్టంట్ రిలేషన్ షిప్స్‌ను ఇష్టపడని హీరో(ప్రదీప్ రంగనాథన్) హీరోయిన్ (కృతి శెట్టి), పాతకాలం నాటి స్వచ్ఛమైన ప్రేమను కోరుకుంటారు. అయితే వీరి ప్రేమకథకు ఎస్. జే సూర్య ఎలా అడ్డుపడతాడు. ఎస్. జే సూర్య నడుపుతున్న 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అనే సంస్థ ఉద్దేశ్యం ఏంటి అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. ఇందులో ప్రేమ గురించే కాకుండా 2040లో ఏం మార్పులు రాబోతున్నాయి అనే చిన్న చిన్న విషయాలను కూడా చాలా చక్కగా చూపించారు మేకర్స్. యోగి బాబు, సీమన్, గౌరీ కిషన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నఈ చిత్రాన్ని లేడీ సూపర్ స్టార్ నయనతారతో కలిసి ఎస్.ఎస్. లలిత్ కుమార్ నిర్మించారు.



# ఫ్యాషన్ సెన్స్‌తో ఊపేస్తున్న శర్మ సిస్టర్స్!

నేహా శర్మ, ఐషా శర్మ.. ఈ పేర్లు వింటేనే సోషల్ మీడియాలో హీట్ అమాంతం పెరిగిపోతుంది. తాజాగా గ్రాజియా ఫ్యాషన్ అవార్డ్స్ వేడుకలో శర్మా సిస్టర్స్ సందడి అంతా ఇంతా కాదు. రెడ్ కార్పెట్‌పై అక్కా చెల్లెళ్లు అడుగుపెట్టగానే కెమెరా కళ్లు అన్నీ అటువైపే.. ఫ్యాషన్ విషయంలో ఎప్పుడూ ప్రయోగాలు చేసే ఈ సోదరీమణులు గ్రాజియా అవార్డ్స్2026 వేడుకలో తమ స్టైలిష్ అప్పియరెన్స్‌తో కుర్రకారు గుండెల్లో గుబులు పుట్టించారు. కేవలం దుస్తులే కాదు.. వీళ్లు క్యారీ చేసిన ఆటిట్యూడ్ కూడా ఈవెంట్‌కే హైలైట్‌గా నిలిచింది. ముఖ్యంగా ఈ వేడుకకు సంబంధించిన వీడియోలు చూస్తుంటే.. శర్మ సిస్టర్స్‌కు మొహమాటం అనేదే లేని కొంటె కోనంగులు అని అర్థమవుతోంది. కెమెరా ముందు ఫోజులివ్వడంలో ఈ భామలు ప్రదర్శించిన ఆత్మవిశ్వాసం అద్భుతం. ఒకరితో ఒకరు పోటీ పడుతూ.. పర్ఫెక్ట్ ఫ్యాషన్ సెన్స్‌తో హొయలు పోతూ వేదికపై ప్రధాన ఆకర్షణగా నిలిచారు. శర్మా సిస్టర్స్ సోషల్ మీడియాల్లోను నిరంతర ఫోటోషూట్లను షేర్ చేస్తూ.. ఫ్యాన్ బేస్‌ను మరింత పెంచుకున్నారు. ఫ్యాషన్ ప్రపంచంలో తమదైన ముద్ర వేయడానికి ఎలాంటి సందేహాలు లేకుండా బోల్డ్ అండ్ బ్యూటిఫుల్ లుక్స్‌తో చేస్తున్న హంగామా ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్‌గా మారుతోంది. నేహా శర్మ తన క్లాసిక్ అందంతో అలరిస్తుంటే.. ఐషా శర్మ తన ఫిట్‌నెస్, మోడ్రన్ స్టైల్‌తో మెరిసిపోయింది. ఈ జోడీ కాంబినేషన్ ఒక పర్ఫెక్ట్ ఫ్యాషన్ ప్యాకేజీలా అనిపిస్తుంది. నేహా ధరించిన అవుట్‌ఫిట్ తనలోని రాజసాన్ని ఉట్టిపడేలా చేయగా.. ఐషా తన డ్రెస్సింగ్‌తో ట్రెండీ వైబ్స్‌ను క్రియేట్ చేస్తోంది. సిస్టర్స్ మధ్య ఉన్న కెమిస్ట్రీ ఒకరికొకరు స్టైల్ పరంగా కాంప్లిమెంట్ ఇచ్చుకునే విధానం ఫ్యాషన్ ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటోంది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. 2026 సంవత్సరం నేహా శర్మకు చాలా కీలకం కానుంది. ఆమె ప్రస్తుతం -జోగిరా సారా రా రా 2- వంటి క్రేజీ ప్రాజెక్టులతో పాటు, ఒక భారీ బడ్జెట్ ఓటీటీ క్రైమ్ థ్రిల్లర్‌లో కూడా నటిస్తోంది. సౌత్ సినిమాలపై కూడా దృష్టి పెడుతూ.. తన సెకండ్ ఇన్నింగ్స్‌ను పటిష్టం చేసుకోవాలని కలలు కంటోంది. నటిగా తన పరిధిని విస్తరించుకుంటూనే.. ఫ్యాషన్ ఐకాన్‌గా తన ఇమేజ్‌ను మరింత బిల్డ్ చేసుకుంటోంది నేహా. మరోవైపు ఐషా శర్మ కూడా ఈ ఏడాది వం-ుస ఒప్పందాలతో దూసుకుపోతోంది. కేవలం వెండితెరకే పరిమితం కాకుండా.. ఒక గ్లోబల్ లైఫ్ స్టైల్ షోకు హోస్ట్‌గా వ్యవహరించేందుకు సిద్ధమైంది. అలాగే ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో పవర్‌ఫుల్ పాత్రకు సంతకం చేసిందని సమాచారం. మ్యూజిక్ వీడియోలు.. బ్రాండ్ ఎండార్స్‌మెంట్లతో ఐషా 2026లో ఫుల్ బిజీగా గడపనుంది. మొత్తంమీద శర్మ సిస్టర్స్ ఇటు కెరీర్ పరంగా.. అటు ఫ్యాషన్ పరంగా తమ జోరును కొనసాగిస్తున్నారు.

# కేజీబీవీ, పీహెచ్‌సీపై కలెక్టర్ హైమావతి ఆకస్మిక తనిఖీలు

సిద్ధిపేట, ఏప్రిల్ 01:లి జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కే. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన నిర్వహణను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భాగార అన్నం, కూర, సాంబారు, పెరుగు నాణ్యతను తనిఖీ చేసి, ప్రతిరోజూ డైట్ మెనూను పాటిస్తూ రుచికరంగా, పరిశుభ్రంగా ఆహారం సిద్ధం చేయాలని వంట సిబ్బందికి ఆదేశించారు. వడ్డన సమయంలో ముందుగా కూర, తర్వాత అన్నం ఇవ్వాలని, విద్యార్థులు కూర్చున్న దగ్గరికి వెళ్లి వడ్డించాలని సూచించారు. విద్యార్థినులు తప్పనిసరిగా కరాటే శిక్షణ పొందాలని, ఇది ఆత్మరక్షణతో పాటు ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఈ శిక్షణ అందిస్తున్నదని పేర్కొన్నారు. అటెండెన్స్, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. విద్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం తీగుల్ గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారికి సూచించారు. ఆసుపత్రిలో అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆదేశించారు.



## కల్యాణ లక్ష్మి చెక్కులతో పాటు , ఇందిరమ్మ నమూనా ఇల్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



జనత న్యూస్ బెజ్జంకి : మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం బెజ్జంకి మండల పర్యటనలో భాగంగా , రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకంలో భాగంగా, స్థానిక తహసిల్దార్ కార్యాలయము ఆవరణలో నిర్మించిన నమూనా ఇందిరమ్మ ఇల్లును , స్థానిక అధికారులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణ లక్ష్మి చెక్కులు 20, మరియు 78 సీఎంఆర్ఎఫ్ చెక్కులు, మొత్తం 23,47000₹ రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ప్రజా సంక్షేమానికి నిరంతరం పరితపిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ కే.శ్రీకాంత్, ఎంపీడీవో కే.ప్రవీణ్ , ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ , బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కిస రత్నాకర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, ఏఎంసి వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు , సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు గూడెల్లి శ్రీకాంత్, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచ్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గరుడ వాహనంపై విహరించిన శ్రీ లక్ష్మీ నరసింహులు



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో గుట్టపై కొలువుదీరిన శ్రీ లక్ష్మీనరసింహుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా, జరుగుతున్న జాతర ఉత్సవాలలో స్వామివారు సోమవారం అశ్వ వాహనంపై ఊరేగగా, మంగళవారం సింహవాహనంపై ఆశీనులైన లక్ష్మీ నరసింహులు బుధవారం గరుడ వాహనంపై విహరిస్తూ బెజ్జంకి పురవీధులలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున, స్వామి అమ్మవార్లకు మంగళ హారతులతో స్వాగతం పలికి స్వామివారి కృపకు పాత్రులు అయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు , నిత్యం అనేక వాహనాలపై స్వామి అమ్మవార్లు దర్శనమిస్తారని, ఏప్రిల్ 2 గురువారం శకటోత్సవం ( గుట్ట చుట్టూ బండ్లు తిరుగుట) కార్యక్రమానికి ఆలయ కమిటీ మరియు గ్రామపంచాయతీ వారి సహకారంతో అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు.

## శాంతియుత వాతావరణంలో శకటోత్సవం నిర్వహించుకుందాం

సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్.



జనత న్యూస్ బెజ్జంకి : మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నటువంటి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శకటోత్సవ కార్యక్రమం ( గుట్ట చుట్టూ బండ్లు తిరుగుట) కార్యక్రమం ఉన్న సందర్భంగా బుధవారం సిద్దిపేట రూరల్ సీఐ శ్రీనివాస్, బెజ్జంకి ఎస్సై బి. సౌజన్య, బండ్లు ట్రాక్టర్లు గల భక్తులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ, శాంతియుత వాతావరణంలో శకటోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసుకుందామని , పోటీయుత వాతావరణంలో కాకుండా , సమన్వయంతో జాతర ఉత్సవాలను నిర్వహించుకుందామని సూచించారు. అలాగే మద్యం సేవించి ఎడ్ల బండ్లు గాని , ట్రాక్టర్ గాని నడపవద్దని , పండుగను విషాదం చేయకుండా, పోలీస్ సిబ్బందికి సహకరించి విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్ యాదవ్, గ్రామ సర్పంచ్ బొల్లం శ్రీధర్ పెద్దన్న, ఆలయ ఈవో శ్రీధర్ రెడ్డి, బెజ్జంకి ఉప సర్పంచ్ దూమాల మహేష్, ఆలయ కమిటీ డైరెక్టర్లు, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో అన్నదాతకు ఐదు ఎకరాలు నష్టం



జనత న్యూస్ బెజ్జంకి : సోమవారం మండలంలో కురిసిన అకాల వర్షానికి వడ్లూరి గ్రామానికి చెందిన జక్కం మనీ శంకర్ తనకున్న 5 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేయడంతో 5 ఎకరాలు నేల వాలి తీవ్ర నష్టం వాటిలినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించే విధంగా సహకరించాలని వేడుకుంటున్నారు.

# రిజ్వీ అద్భుత పోరాటం...

## లక్నో చేతుల్లోంచి గెలుపును లాగేసుకున్న ఢిల్లీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. బుధవారం నాడు లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. కేవలం 26 పరుగులకే 4 కీలక వికెట్లు కోల్పోయి ఓటమి అంచున నిలిచిన ఢిల్లీని, యువ బ్యాటర్ సమీర్ రిజ్వీ (47 బంతుల్లో 70 నాటౌట్; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) తన అసాధారణ ఇన్నింగ్స్‌తో గెలిపించాడు. ట్రిస్టన్ స్టబ్స్ (32 బంతుల్లో 39 నాటౌట్) అతనికి అండగా నిలిచాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు అజేయంగా 119 పరుగులు జోడించి జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించారు.

లక్నోలోని ఏకానా స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ బౌలర్ల ధాటికి 18.4 ఓవర్లలో 141 పరుగులకే కుప్పకూలింది. ఆ జట్టులో అబ్దుల్ సమద్ (36), మిచెల్ మార్ష్ (35) మాత్రమే చెప్పుకోదగ్గ స్కోర్లు చేశారు. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఢిల్లీ బౌలర్లలో లుంగి ఎంగిడి, టి. నటరాజన్ చెరో మూడు వికెట్లతో లక్నో పతనాన్ని శాసించగా, కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు పడగొట్టాడు.

అనంతరం 142 పరుగుల సాధారణ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆరంభం ఆశించిన స్థాయిలో లభించలేదు. కేఎల్ రాహుల్ (0), నితీశ్ రాణా (15), పతుమ్ నిస్సంక (1), కెప్టెన్ అక్షర్ పటేల్ (0) స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరడంతో ఢిల్లీ 4.3 ఓవర్లలో 26 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట దశలో క్రీజులో కలిసిన సమీర్ రిజ్వీ, ట్రిస్టన్ స్టబ్స్



అద్భుతమైన పోరాటపటిమ కనబరిచారు. లక్నో బౌలర్లను సమర్థంగా ఎదుర్కొంటూ స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. ముఖ్యంగా రిజ్వీ తన క్లాస్ షాట్లతో అలరించి, ఒత్తిడిలోనూ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరి అద్భుత భాగస్వామ్యంతో ఢిల్లీ మరో వికెట్ నష్టపోకుండా 17.1 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది.

### వణికించిన ఢిల్లీ బౌలర్లు... కుప్పకూలిన లక్నో సూపర్ జెయింట్స్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్ జట్టు పేలవ బ్యాటింగ్ ప్రదర్శనతో నిరాశపరిచింది. ఢిల్లీ క్యాపిటల్స్ (ఐజ) బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో లక్నో నిర్ణీత 20 ఓవర్లు కూడా ఆడలేకపోయింది. 18.4 ఓవర్లలో 141 పరుగులకే ఆలౌట్ అయింది. లక్నో బ్యాటర్లలో అబ్దుల్ సమద్ (36) మినహా మిగతా వారెవరూ రాణించలేకపోయారు. ఢిల్లీ బౌలర్లలో లుంగి ఎంగిడి, టి. నటరాజన్ చెరో మూడు వికెట్లతో లక్నో పతనాన్ని శాసించారు. లక్నోలోని ఏకనా స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ అక్షర్ పటేల్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. తన నిర్ణయం సరైనదేనని ఢిల్లీ బౌలర్లు ఆరంభం నుంచే నిరూపించారు. ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే రిషబ్ పంత్ (7) అనవసర పరుగుకు యత్నించి రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఎయిడెన్ మార్క్‌రమ్ (11) ఒక సిక్స్, ఫోర్‌తో దూకుడుగా కనిపించినా, అక్షర్ పటేల్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. ఆ వెంటనే ఆయుష్ బదోని (0) డకౌట్ కావడంతో లక్నో 49 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులో ఉన్న మిచెల్ మార్ష్ (35), నికోలస్ పూరన్ (8) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. అయితే, పూరన్‌ను ఎంగిడి బౌల్డ్ చేయగా, దూకుడుగా ఆడుతున్న మార్ష్‌ను కుల్దీప్ యాదవ్ పెవిలియన్ పంపాడు. దీంతో లక్నో 71 పరుగులకే సగం వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత వచ్చిన అబ్దుల్ సమద్ (25 బంతుల్లో 36; 3 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటం చేశాడు. ముకుల్ చౌదరి (14), షాబాజ్ అహ్మద్ (15 నాటౌట్)తో కలిసి జట్టు స్కోరును 140 మార్కు దాటించాడు. అయితే, చివరి ఓవర్లలో నటరాజన్, ఎంగిడి వరుసగా వికెట్లు తీయడంతో లక్నో ఇన్నింగ్స్ 141 పరుగుల వద్ద ముగిసింది. ఢిల్లీ బౌలర్లలో ఎంగిడి (3/27), నటరాజన్ (3/29) అద్భుతంగా రాణించగా, కుల్దీప్ యాదవ్ రెండు, అక్షర్ పటేల్ ఒక వికెట్ పడగొట్టారు.

# సెస్ రెన్యువల్ లైసెన్స్ నిలిపివేత

## ఎన్పీడీసీఎల్ అధికారుల పర్యవేక్షణ.

## జిల్లాలో ఆసక్తికర పరిణామం.

సిరిసిల్ల. ఏప్రిల్ 1. జనత న్యూస్

**దేశంలోనే సహకార రంగం లో ప్రతిష్టాత్మకమైన సహకార విద్యుత్ సరఫరా సంఘం, సెస్ లైసెన్స్ రెన్యువల్ నిలిపివేత అంశం తెలంగాణ రాష్ట్రంలోనే చర్చనీయాంశంగా మారింది. సెస్ నేపథ్యం, ప్రస్తుత పరిస్థితులపై "జనత న్యూస్"ప్రత్యేక కథనం..**



దశాబ్దాల చరిత్ర ఆనవాలు కోల్పోతుందా..? అన్న సందేహం కలుగుతుంది. ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో విద్యుత్ వినియోగదారులతో పాటు రైతులకు నేత కార్మికులకు విద్యుత్ సేవలను అందిస్తున్న సెస్ లైసెన్స్ రెన్యువల్ నిలిపివేత అంశం చర్చ నీయాంశంగా మారింది. 1970లో ప్రారంభమైన సహకార విద్యుత్ సరఫరా సంఘం (సెస్ )సేవలు 4730 విద్యుత్ కనెక్షన్లతో ప్రారంభమై మూడు లక్షల 27 వేల 685 సర్వీసులకు పెరిగింది. జిల్లాలో వ్యవసాయ రంగంతో పాటు మరమగ్గాల పరిశ్రమ అభివృద్ధికి విద్యుత్ సేవలను అందిస్తూ వస్తుంది. దాదాపు 57 సంవత్సరాల సుదీర్ఘ ప్రయాణంలో ఇప్పటివరకు సహకార రంగంలోనే విద్యుత్ వినియోగదారులకు సేవలు అందించడంలో పాలకవర్గాలు కృషి చేస్తూ ఎనలేని ప్రతిష్టను సంపాదించి పెట్టాయి.

ఇటీవల అనూహ్యంగా జిల్లాలో జరుగుతున్న పరిణామాలు చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఏప్రిల్ 1 న ఎన్పీడీసీఎల్ అనూహ్యంగా సెస్ కు సంబంధించిన పర్యవేక్షణ బాధ్యతలను తీసుకుంటున్నట్లు ప్రకటించడం గమనార్హం. జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు సేవ లను అందిస్తున్న" సెస్ " ప్రతిష్టాత్మకమైన పేరును సంపాదించడమే కాకుండా ప్రభుత్వాల నుండి ప్రశంసలు కూడా అందుకుంది. అలాంటి "సెస్" లైసెన్స్ రెన్యువల్ కాకపోవడంతో ఎన్పీడీసీఎల్ పర్యవేక్షణలోకి వెళ్లే పరిస్థితి వచ్చింది.



### ఆందోళన చెందవద్దు..

-వరుణ్ రెడ్డి ,ఎన్పీడీసీఎల్ సిఎండి.

సెస్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దని వినియోగదారులకు ఆటంకం లేకుండా విద్యుత్ సేవలు అందించడం జరుగుతుందని ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి బుధవారం మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. సెస్ లైసెన్స్ రెన్యువల్ కానందున ఎన్పీడీసీఎల్ పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు. రానున్న వేసవికాలం దృష్ట్యా ఎలాంటి విద్యుత్ అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. సెస్ ఉద్యోగులు కూడా ఎలాంటి ఆందోళన చెందవద్దని వృత్తిపరమైన భద్రత కల్పిస్తామని స్పష్టం చేశారు. "సెస్"ఎన్పీడీసీఎల్ పర్యవేక్షణలోకి వెళ్లడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. సెస్ లో జరుగుతున్న పరిణామాలు జిల్లానే కాకుండా రాష్ట్రంలోనూ చర్చనీయాంశంగా మారాయి.

# నేటి గ్రామసభలో ధరఖాస్తులు స్వీకరించండి

## లబ్ధిదారుల జాబితాలు వినిపించండి

## 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## జడ్పీ సీఈవో శ్రీనివాస్



తిమ్మాపూర్, జనతా న్యూస్ : ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యక్రమంలో గురువారం అన్నీ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని, అందులో ప్రభుత్వ పథకాలు అందని వారి నుండి ధరఖాస్తులను స్వీకరించాలని, ఇతర సమస్యలున్నా ధరఖాస్తులు స్వీకరించాలని జిల్లా పరిషత్ సీఈవో శ్రీనివాస్ సూచించారు. తిమ్మాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గ్రామసభ కో ఆర్డినేషన్ సమావేశాన్ని నిర్వహించారు. సీఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ... ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామ సభల వద్ద ప్రభుత్వ సూచన మేరకు పాటను పాడి, సీఎం సందేశాన్ని వినిపించాలని సూచించారు. గ్రామసభ వద్ద నీడ, మైక్, ప్రొజెక్టర్, హెల్ప్ డెస్క్ ని ఏర్పాటు చేయాలని తెలిపారు. గ్రామం వారిగా అన్నీ శాఖల ద్వారా అందిన లబ్ధిదారుల జాబితాను సిద్ధంగా ఉ ంచుకుని గ్రామసభలో చదివి వినిపంచాలని తెలిపారు. వివిధ శాఖల ద్వారా లబ్ధి కావాలని కోరుకునే వారి నుండి ధరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. వ్యవసాయ, విద్యుత్, గృహ, సివిల్ సప్లై, త్రాగునీరు, ఉపాధి హామీ, వడ్డీ లేని రుణాలు, మహాలక్ష్మీ, కళ్యాణ లక్ష్మీ, షాదీ ముభారక్ తోపాటు ప్రైమరీ నుండి ఇంటర్ వరకు విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మిడ్ డే మీల్స్, వికలాంగులైన ఇంటర్ విద్యార్థులకు వెహికిల్స్, పేదలకు భీమా సౌకర్యం, ఆరోగ్యం, స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అందుతున్న లబ్ధిని గ్రామసభలో చదివి వినిపించాలని తెలిపారు. అలాగే కేంద్రం అందిస్తున్న భీమా సౌకర్యం వివరాలను సైతం గ్రామసభలో తెలుపాలని చెప్పారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతు భరోసా, రైతు భీమా, రుణ మాఫీ, రూ.500 బోనస్, రెండు గ్రామాల్లో మట్టి నమూనా వివరాలను వెల్లడించాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పూర్తి సమాచారాన్ని వినిపించాలని అన్నారు. ఉపాధి హామీ కింద చేపట్టిన పనులు, నిర్మణాలు, వడ్డీ లేని రుణాలు, గృహ జ్యోతి కింద లబ్ధిదారుల వివరాలు, గ్యాస్, రేషన్ కార్డులు, సన్న బియ్యం లబ్ధిదారులతోపాటు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబార్ లబ్ధిదారుల వివరాలు వివిపించాలన్నారు. పాఠశాలల్లో, ఇంటర్ కళాశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్టు తోపాటు మిడ్ డే మీల్స్ అందుతాయని తెలిపారు. ఇంటర్ వికలాంగులైన విద్యార్థులకు వెహికిల్స్ అందుతాయన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలు, వాటికి పరిష్కార మార్గాలు తెల్సుకోవాలన్నారు. గ్రామాల్లో లబ్ధిదారులతో మాట్లాడించి వారి అభిప్రాయాలను చెప్పించాలని సూచించారు. గ్రామాలలో నిర్వహించే గ్రామసభలను విజవంతం చేయాలని సీఈవో శ్రీనివాస్ సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం జూన్ 2 వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచులు సైతం వారి అభిప్రాయాలను తెలిపారు.

తమ ప్రమేయం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని, పలు గ్రామాల్లో అనర్హులను ఎంపిక చేస్తున్నారని సర్పంచులు సీఈవోకు తెలిపారు. మొగిలిపాలెంలో మొక్కజొన్న విత్తనం ఫెయిల్ కావడంతో చాలా మంది రైతులు నష్టపోయారని, వారికి కంపెనీ నుండి పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. 15వ ఫైనాన్స్ నిధులను అత్యవసర పనులకు వినియోగించుకునేలా చూడాలని కోరారు. పాఠశాలల్లో బ్రేక్ ఫాస్టు, మిడ్ డే మీల్స్ తయారీ దారులకు శిక్షణ ఇప్పించాలని, నాణ్యమైన వస్తువులు వాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాస రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్, ఎంఈవో శ్రీనివాస్, ఏవో సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

# హై లెవెల్ బ్రిడ్జి, డబుల్ రోడ్డు పనుల పరిశీలన: విప్ విజయరమణారావు



పెద్దపల్లి/కరీంనగర్, మార్చి 31: మానేరు వాగుపై నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి మరియు నూతన డబుల్ రోడ్డు పనులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పరిశీలించారు. ఓదెల మండలం రూపునారాయణపేట--జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాల మధ్య నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి పనులను ప్రజా ప్రతినిధులు, ఇంజనీర్లతో కలిసి పరిశీలించారు. ప్రజల దీర్ఘకాలిక అవసరంగా ఉన్న ఈ ప్రాజెక్టుకు రూ.80 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. నాణ్యతతో పనులు చేపట్టి వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా పోతకపల్లి గ్రామ శివారులో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కూడా పరిశీలించారు. అనంతరం పోతకపల్లి నుండి కాల్వ శ్రీరాంపూర్ వరకు రూ.27 కోట్లతో నిర్మిస్తున్న డబుల్ రోడ్డు పనులను తనిఖీ చేసి నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. తదుపరి రూపునారాయణ పేటలో శ్రీ శివ పంచాయతన అభయాంజనేయ స్వామి దేవాలయం 10వ వార్షికోత్సవ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 60 ఏళ్ల సాగు... హక్కులు లేవని రైతుల ఆవేదన




చిగురుమామిడి,జనత న్యూస్:కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం రేకొండ గ్రామానికి చెందిన సుమారు 120 ఎకరాల భూములను రికార్డుల్లో 'సీలింగ్ భూములు'గా చూపుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.సమస్య పరిష్కరించి పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేయాలని కోరుతూ హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రభుత్వానికి వినతి పత్రం సమర్పించారు.చిగురుమామిడి మండలం,రేకొండ గ్రామ పరిధిలోని ఈ భూములను పూర్వపు పట్టాదారులు వెలిమల రంగోపాల్‌రావు, వెలిమల మదన్‌మోహన్‌రావు కుటుంబ సభ్యుల నుంచి సుమారు 60 ఏళ్ల క్రితం నిరుపేద సన్నకారు రైతులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. కోర్టు డిక్రీలు, రిజిస్ట్రేషన్లు, సాదాబైనామాల ఆధారంగా కొనుగోలు చేసి దశాబ్దాలుగా సాగు చేస్తున్నప్పటికీ, ప్రభుత్వ రికార్డుల్లో పొరపాటున 'సీలింగ్ భూములు'గా నమోదు కావడంతో పట్టాదారు హక్కులు లేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు.పట్టాదారు హక్కులు లేక రైతు బీమా, సబ్సిడీలు, బ్యాంకు రుణాలు వంటి ప్రభుత్వ ప్రయోజనాలు అందక ఆర్థికంగా నష్టపోతున్నామని తెలిపారు. సాగులో ఉ న్న అసలైన రైతులకు వెంటనే పట్టాదారు పాస్‌పుస్తకాలు జారీ చేసి రికార్డుల్లోని పొరపాటును సరిదిద్దాలని ప్రభుత్వాన్ని కోరారు.వినతిని స్వీకరించిన మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి సమస్యను పరిశీలించి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినట్లు రైతులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

# నూతన 'ఆరోగ్యలక్ష్మి' కమిటీ ఎన్నిక

## కమిటీ చైర్మన్‌గా కౌన్సిలర్ పూదరి వరప్రసాద్



హుస్నాబాద్,జనత న్యూస్: పట్టణంలోని 6వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఆరోగ్యలక్ష్మి సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్, 19వ వార్డు కౌన్సిలర్ బత్తుల స్వరూప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కేంద్రం పనితీరును మెరుగుపరచడం మరియు పౌష్టికాహార పంపిణీని పర్యవేక్షించడం కోసం ఈ సందర్భంగా 12 మంది సభ్యులతో కూడిన నూతన ఆరోగ్యలక్ష్మి కమిటీని ఎన్నుకున్నారు.ఈ కమిటీకి చైర్మన్‌గా కౌన్సిలర్ వరప్రసాద్ ఎన్నికవ్వగా, సభ్యులుగా ఆశ కార్యకర్త, అంగన్‌వాడీ టీచర్, వీఓ ప్రతినిధి, కిశోర బాలికలు, గర్భిణులు, బాలింతలు మరియు 6 నెలల నుండి 6 ఏళ్ల లోపు పిల్లల తల్లిదండ్రులను నియమించారు.ఈ కమిటీ అంగన్‌వాడీ కేంద్రం యొక్క స్థితిగతులను పరిశీలించడంతో పాటు గర్భిణులు, బాలింతలకు సరైన పోషకాహారం అందేలా చూస్తుందని ఐసీడీఎస్ సూపర్వైజర్ కవిత పేర్కొన్నారు.అనంతరం 6 నెలల నుండి 3 ఏళ్ల లోపు చిన్నారులకు బాలామృతం మరియు కోడిగుడ్లను పంపిణీ చేశారు. 6 నెలలు నిండిన చిన్నారికి అన్నప్రాశన కార్యక్రమాన్ని నిర్వహించి శుభాకాంక్షలు తెలిపారు. కేంద్రంలోని పిల్లల ఎత్తు, బరువులను తనిఖీ చేసి, తక్కువ బరువున్న పిల్లల పట్ల తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గర్భిణులు మరియు బాలింతలు అంగన్‌వాడీ కేంద్రం ద్వారా అందుతున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్లు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సునీత, ఆయా లక్ష్మి, వార్డుల పరిధిలోని తల్లులు పాల్గొన్నారు.

# ఇసుక తీసుకునేందుకు అనుమతివ్వండి



తిమ్మాపూర్, జనతా న్యూస్ : తిమ్మాపూర్ మండలంలోని రేణికుంట, కొత్తపల్లి వద్ద మోయతుమ్మెద వాగు నుండి ఇసుకను సాండ్ టాక్స్ ద్వారా తీసుకునేందుకు అనుమతివ్వాలని పలువురు సర్పంచులు కరీంనగర్ జడ్పీ సీఈవో శ్రీనివాస్ ని కోరారు. ఇసుక కొరత కారణంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయని, నెమ్మదిగా జరుగుతున్నాయని, ఇందిరమ్మ ఇండ్ల పనులు సైతం జాప్యం జరుగుతున్నాయని, లబ్ధిదారులపై అధిక భారం పడుతుందని సర్పంచులు సీఈవోకు తెలిపారు. సాండ్ టాక్స్ ఉన్న గ్రామాల నుండి ఇసుకను తీసుకురావడానికి తిమ్మాపూర్ మండలంలోని అన్నీ గ్రామాలకు అత్యధికంగా డబ్బులు తీసుకుంటున్నారని, తమ మండలంలో అనుమతిస్తే తక్కువ ధరకు ఇసుక లభిస్తుందని సర్పంచులు తెలిపారు. చేసిన పనులకు బిల్లులు రావడం లేదనే మాట గ్రామాల్లో వినిపిస్తుందని, గత బిల్లులు రాక సర్పంచులు చనిపోయారని, అప్పుల పాలయ్యారని, ఇప్పుడు చేసినా బిల్లులు వచ్చే పరిస్థితి ఉ ండదనే అపోహ గ్రామాల్లో ఉందని, అలాంటి అపోహలను తొలగించే విధంగా బిల్లులు వెంటవెంటనే ఇప్పించాలని సర్పంచులు సీఈవోను కోరారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఇసుక సమస్య రాకుండా పరిష్కార మార్గం చూపాలని సర్పంచులు సీఈవోను కోరారు.

# ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్, మార్చి 31:లి ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR) కార్యక్రమంలో భాగంగా ఓటర్ మ్యాపింగ్ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ అర్బన్, రూరల్, కొత్తపల్లి మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, బిఎల్ఓ సూపర్వైజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియలో వెనుకబడిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బిఎల్ఓ సూపర్వైజర్లు, సూపర్వైజర్లు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది సమన్వయంతో విస్తృతంగా ఈ ప్రక్రియలో పాల్గొనాలని ఆదేశించారు. వారం రోజుల్లో లక్ష్యాలను పూర్తి చేయాలని, ప్రతిరోజూ పురోగతిపై నివేదికలు అందించాలని తెలిపారు. పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగాలని, వారం తర్వాత మ-రోసారి సమీక్ష నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మహనీయుల జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిద్దాం: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కరీంనగర్, మార్చి 31:లి బాబు జగ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఈసారి మునుపెన్నడూ జరగని విధంగా అత్యంత వైభవంగా నిర్వహించాలని చొప్పదండి ఎమ్మెల్యే, జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలిచేలా ఉత్సవాలను నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు. సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకుంటూ ఉత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఇతర అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ జయంతి ఉత్సవాలను పండుగలా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పాఠశాలల్లో మహనీయుల జీవిత చరిత్రపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని, వీడియో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్రామాలు, పట్టణాల్లో విగ్రహాల వద్ద అన్ని సదుపాయాలు కల్పిస్తామని, ఉత్సవాలకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. దళిత సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని ఉత్సవాలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. దళితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని, ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటుతో సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాల ద్వారా యు-వతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వెల్లడించారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం మాట్లాడుతూ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా భద్రతా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్ బాబు, టౌన్ ఏసీపీ వెంకటస్వామి, సోషల్ వెల్ఫేర్ అధికారులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రబీ ప్యాడీ కొనుగోళ్లకు సమగ్ర ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్ కే. హైమావతి



సిద్ధిపేట, ఏప్రిల్ 01:లి రబీ (యాసంగి) 2025--26 సీజన్లో వరిధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు కొనుగోలు కేంద్రాల్లో ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులకు సూచించారు. ఐడీఓసీ సమావేశ మందిరంలో డీఆర్డీఓ, సహకార శాఖ, మెప్మా అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లాలో ధాన్యం దిగుబడి పెరిగే అవకాశమున్నందున తగినన్ని కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. రైతులకు మంచినీరు, టెంట్లు, బ్యానర్లు, ప్యాడీ క్లీనర్లు, రిజిస్టర్లు, టార్పాలిన్లు, లైటింగ్ వంటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. అకాల వర్షాల దృష్ట్యా ఎత్తైన ప్రదేశాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసి, ధాన్యాన్ని బాగా ఆరబెట్టిన తర్వాత మాత్రమే తీసుకురావాలని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా చూడాలని తెలిపారు. ధాన్యాన్ని తూర్పారబెట్టిన తరువాతనే మిల్లులకు తరలించాలని, రైతులతో పూర్తి అవగాహన కల్పించి కన్సెంట్ తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి కేంద్రంలో మాయిశ్చర్ మీటర్లు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఉదయం ధాన్యాన్ని లారీల్లో లోడ్ చేసి మధ్యాహ్నం కల్లా మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, మిల్లుల సామర్థ్యాన్ని బట్టి నిల్వలు నిర్వహించాలని సూచించారు. లోపాలు తలెత్తితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, సివిల్ సప్లై అధికారి తనూజ, డీఎం గోపీకృష్ణ, ఎల్డీఎం హరిబాబు, మార్కెటింగ్ అధికారి నాగరాజు, అడిషనల్ డీఆర్డీఏ సుధీర్ బాబు, మెప్మా పీడీ హన్మంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వార్డు సభలను విజయవంతం చేయాలి: కమీషనర్ ప్రఫుల్ దేశాయ్




కరీంనగర్, ఏప్రిల్ 01:లి ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2న నగరవ్యాప్తంగా నిర్వహించే వార్డు (డివిజన్) సభలను విజయవంతం చేయాలని నగరపాలక సంస్థ కమీషనర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో ఇంజనీరింగ్, సానిటేషన్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్డు సభల నిర్వహణకు సంబంధించిన ప్రణాళిక, ఏర్పాట్లు, జన సమీకరణ, ముఖ్య అతిథుల ఆహ్వానం తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ నగరంలోని 66 డివిజన్లలో ఉదయం 10 గంటలకు వార్డు సభలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట టెంట్లు, కుర్చీలు, త్రాగునీటి సదు-పాయాలు కల్పించాలని ఆదేశించారు. కార్పొరేటర్ల సమన్వయంతో వార్డు అధికారులు సభలను నిర్వహించాలని, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సభలకు ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, యువకులు, అంగన్వాడీ, ఆశ వర్కర్లు, సంక్షేమ పథకాల లబ్ధిదారులు తప్పనిసరిగా పాల్గొనేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, లబ్ధిదారుల పేర్లను సభలో చదవాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి, గృహజ్యోతి, పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు భరోసా తదితర పథకాలపై సంబంధిత శాఖల అధికారులు వివరించాలని తెలిపారు. అదేవిధంగా నగరపాలక సంస్థకు సంబంధించిన ఆస్తి పన్నులు, నల్లా పన్నులు, ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు, డివిజన్ల వారీగా అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 66 డివిజన్లలో వార్డు సభలను సమర్థవంతంగా నిర్వహించి ప్రజలను భాగస్వాములుగా మార్చాలని కమీషనర్ తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమీషనర్లు ఖాధర్ మొహియుద్దీన్, వేణుమాధవ్, ఎంహెచ్ ఓ, డీఈలు, ఏఈలు, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, సానిటేషన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## వడ్లూరు సమ్మక్క గద్దె వరకు సిసి రోడ్డు నిర్మాణం



జనత న్యూస్ బెజ్జంకి : మండలంలోని వడ్లూరు గ్రామంలో గల ఎస్సీ కాలనీ వెళ్లే బ్రిడ్జి వద్ద నుండి , సమ్మక్క సారలమ్మ గద్దెల వరకు సుమారు పది లక్షల విలువగల సిసి రోడ్డు నిర్మాణ పనులను బుధవారం ప్రారంభించినట్లు గ్రామ సర్పంచ్ పులి రమేష్ గౌడ్ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ల సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బెజ్జంకి మరియా అనిల్, వార్డు సభ్యులు , పంచాయత్ రాజ్ ఏఈ ,పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం



చిగురుమామిడి,జనత న్యూస్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల సొంతింటి కలను నెరవేర్చుతోందని హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి అన్నారు. మండలంలోని గునుకులపల్లె గ్రామంలో ఇందిరమ్మ పథకం లబ్ధిదారు బరిగెల మమత రాజుల కొత్త ఇంటి గృహప్రవేశ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కంది తిరుపతి రెడ్డి రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీలకతీతంగా పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో అవినీతి లేకుండా ప్రభుత్వం ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు విడుదల చేస్తోందన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. సొంతింటి కల నెరవేరడంతో తాము ఆనందంగా ఉన్నామని లబ్ధిదారులు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్ కుమార్, సర్పంచ్ గునుకుల మధుసూదన్ రెడ్డి, హౌసింగ్ ఏఈ విజయలక్ష్మి, గ్రామపంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనాలతో సమాజ ఐక్యత బలోపేతం

**: ఆర్ఎస్ఎస్ నేత కాచం రమేష్**



కరీంనగర్, మార్చి 31:లి హిందూ సమాజాన్ని ఏకం చేసే బృహత్తర ప్రయత్నంగా దేశవ్యాప్తంగా "హిందూ సమ్మేళనం" కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ తెలిపారు. కరీంనగర్‌లోని బృందావన్ గార్డెన్‌లో జరిగిన హిందూ సమ్మేళనాల సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆర్ఎస్-ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పలు కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని, విజయదశమి ఉత్సవం, పంచ పరివర్తన్ వంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం తీసుకొచ్చాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా హిందూ సమ్మేళనాలను విజయవంతం చేయడానికి స్వయంసేవకులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణాలు, బస్తీలు, గ్రామీణ ప్రాంతాల్లో అన్ని వర్గాలను కలుపుకొని సమ్మేళనాలను నిర్వహించాలని అన్నారు. ఖండ, ఉపఖండ స్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసి సమాజంలోని అన్ని వర్గాల భాగస్వామ్యంతో కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సమ్మేళనాల్లో మేధావులు, సామాజిక నాయకులు, స్వామీజీల ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విభాగ్ కార్యవాహ పాక సత్యనారాయణ, జిల్లా సంఘచాలకులు దుర్శెట్టి నిరంజనా చారి, సహ సంఘచాలకులు ఎలగందుల సత్యనారాయణ, నగర సంఘచాలకులు హనుమాండ్ల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ట్రాఫిక్ పోలీసుల చర్యలు

**70 వాహనాలు సీజ్**




కరీంనగర్, ఏప్రిల్ 01: నగరంలో నెంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 70 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ పర్యవేక్షణలో బుధవారం నగరవ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సరైన నెంబర్ ప్లేట్లు లేని, నెంబర్లు స్పష్టంగా కనిపించని, ట్యాంపరింగ్ చేసిన వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. పట్టుబడిన వాహనాలకు నిబంధనల ప్రకారం వెంటనే నెంబర్ ప్లేట్లు అమర్చించి, వాహనదారులపై జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ మాట్లాడుతూ నెంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, నేరాలకు పాల్పడేందుకు లేదా చలానాలు తప్పించుకునేందుకు ఇలా చేస్తున్నారని పేర్కొన్నారు. ఇటువంటి చర్యలను తీవ్రంగా పరిగణించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం హెచ్ఎస్ఆర్పీ నెంబర్ ప్లేట్లు తప్పనిసరిగా అమర్చుకోవాలని సూచించారు. నెంబర్లపై స్టిక్కర్లు వేయడం, నెంబర్లను మార్చడం చట్టరీత్యా నేరమని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలు నడిపే వాహనాలపై నెంబర్ ప్లేట్లు ఉన్నాయో లేదో గమనించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలందరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com